జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 08 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 185 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 08:53:17 వరకు నక్షత్రంరేవతి - 27:24:42 వరకు కరణంవిష్టి - 08:53:17 వరకు, బవ - 20:21:24 వరకు పక్షంకృష్ణ యోగంగణ్డ - 25:50:48 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

**గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను

మిగతా 2లో..

### నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే

**ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు గడువు విధింపు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనం, పరిరక్షణకు సంబంధించిన తుది నివేదికపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని హైపవర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. నవంబర్ 30లోగా తుది నివేదికను సమర్పించాలని డెడ్‌లైన్ విధించింది. గడువులోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే మొత్తం

మిగతా 2లో..



# అసెంబ్లీ వద్ద రచ్చ..

- సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత
- హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన
- నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
- నినాదాలు, ప్లకార్డులతో మూకుమ్మడి నిరసన
- పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట
- అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
- మరింతగా నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
- పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్ కు గాయాలు
- ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డ బీఆర్ఎస్
- పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో కేటీఆర్ ఆగ్రహం
- తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు

మిగతా 2లో..

### ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

- సీఎం రేవంత్ సారీ చెప్పాలి
- రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- టీషర్టులతో మీరు పార్లమెంట్‌కు వెళ్తారు
- మేము టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?
- పోలీసుల అభ్యంతరంపై హరీశ్‌రావు
- ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ..
- మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
- శాంతియుతంగా నిరసనపై ఉక్కుపాదమా!
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన హరీశ్‌రావు, ప్రస్తుత శాసనసభ ప్రజాస్వామ్యబద్ధంగా నడవడం లేదని, అది కౌరవ సభను తలపిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలోనే ఈరోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని, ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను దుర్మార్గంగా ప్రయోగిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు

మిగతా 2లో..

## స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు..!

వ్యాఖ్యలతో అసెంబ్లీలో రాజకీయ దుమారం

కంటతడి పెట్టుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది. మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు. శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో

మిగతా 2లో..

### ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి
- 22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ
- వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక

మిగతా 2లో..

### ముగిసిన బీఏసీ సమావేశాలు

ఈనెల 12 వరకు అసెంబ్లీ

హైదరాబాద్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మిగతా 12లో..

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా

కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు

పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర

దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి

సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది

మిగతా 12లో..

### తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసి నిర్ణయం

నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

### అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం

ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు

రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్1(ప్రజాజ్యోతి): తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని,

మిగతా 12లో..

### యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా

12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు

బాఘ్‌పత్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్

మిగతా 12లో..



## 22ఏ పేరుతో సాగుతున్న భూదందా

- భూదందా వెనుక పొంగులేటి ఉన్నారు
- వేల కోట్లు కొల్లగొడుతున్న పొంగులేటి
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- గన్‌పార్క్ వద్ద బీజేపీ తీవ్ర నిరసన



హైదరాబాద్, సెప్టెంబర్7(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో సెక్షన్ 22ఏ నిషిద్ధ భూముల పేరుతో సాగుతున్న భారీ భూదందా వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తముందని, ఈ అక్రమాల ద్వారా ఆయన వేల కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి... రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది అమలు కావడం లేదని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషిద్ధ భూముల జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల న్యాయమైన భూములను నిలిపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

# సంపాదకీయం

## జటిలమైన రాజకీయ భవిష్యత్తు!

ఏదీ తెగేదాకా లాగొద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే. కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి. సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది. కానీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నరు.

.............

## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు.

# అసెంబ్లీ వద్ద రచ్చ..

మొదటిపేజీ తరువాయి..


నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, దాడుల ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.

## ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

మొదటిపేజీ తరువాయి..

విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు వేసుకుని పార్లమెంట్‌కు వెళ్లారని, తాము అలా అసెంబ్లీకి రాకూడదా అని ప్రశ్నించారు. నల్ల టీషర్టుపై హామీలు అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్న ఆయన, తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి రాకూడదనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వస్తే ప్రశ్నిస్తారనే అడ్డుకుంటున్నారని, ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నేతల ఆరోపణలపై ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం నేరం కాదని పేర్కొన్నారు. నల్ల టీషర్టులపై అభ్యంతరకర పదాలున్నాయని తెలిపారు. టీషర్ట్‌లపై ఉన్న పదాల కారణంగానే అసెంబ్లీ లోపలికి అనుమతించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్న డీసీపీ, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారన్న శిల్పవల్లి, అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటన వీడియోలను పరిశీలిస్తామన్నారు. ఆందోళన సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హరీశ్‌రావు,



## స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు..!

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడారు. “స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే..

స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం” అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించరని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు మండలి సభ్యులు బూతులు మాట్లాడారన్నారు. తాతా మధు, నవీన్ మీద చర్యలు తీసుకోవాలని.. వీధుల్లో కొట్లాడినట్లు.. అసెంబ్లీ ముందు ప్రవర్తించారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని.. కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగిందని సీతక్క పేర్కొన్నారు. సభలో ప్రసంగిస్తూ మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు.. స్పీకర్ స్థానాన్ని అవమానించడం సరికాదన్నారు..

## సింగపూర్‌లో భారతీయులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు..

### విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7(ప్రజాజ్యోతి): సింగపూర్‌లో స్థానిక భారతీయులను, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో సాగుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలపై ఆ దేశ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దుల్లో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనలతో పాటు, ఎయిర్ ఇండియాల్లో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల వ్యవహారాన్ని ముడిపెడుతూ కొంతమంది ఆన్‌లైన్‌లో భారతీయులపై తీవ్ర స్థాయిలో ద్వేషాన్ని చిమ్మడంపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కే. షణ్ముగం, లీ సీన్ లూంగ్‌లు తీవ్రంగా స్పందించారు. ఈ జాత్యహంకార వ్యాఖ్యలను “అత్యంత సిగ్గుచేటు, హేయం, ఎంతమాత్రం సహించరానివి”గా అభివర్ణించిన సీనియర్ మంత్రి కె.షణ్ముగం, వీటిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సమాజంలో మత, జాతిపరమైన సామరస్యానికి భంగం కలిగించే ఈ పోస్టులను వెంటనే తొలగించాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను కోరింది. ఏ ఒక్క వర్గంపైనా ద్వేషాన్ని సాధారణ అంశంగా మారనివ్వబోమని, తప్పు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సింగపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

మొదటిపేజీ తరువాయి..

కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిధి, పర్యావరణ పరిరక్షణ, ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం కమిటీని ఏర్పాటు చేసింది. ఆరావళి ప్రాంతాన్ని ఏ విధంగా గుర్తించాలి? ఏ ప్రాంతాలను రక్షణ పరిధిలోకి తీసుకురావాలి? మైనింగ్‌పై ఎలాంటి నియంత్రణలు ఉండాలి? అనే అంశాలపై కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. తుది నివేదిక సమర్పించేందుకు కమిటీకి గతంలో ఇచ్చిన గడువు ఆగస్టు 31తో ముగిసింది. అయితే ఆ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగే విధంగా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ పేర్కొంది. అందులో భాగంగా మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే ఆ అభ్యర్థనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆ వ్యవహారాన్ని విచారించింది.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

మెట్రో జోన్, మింట్ కాంపౌండ్:: హైదరాబాద్-63

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ స్పెక్ నం. eMZ-20 (New), 21 (New) & 22 (New) of 2026-27

టెండర్ నోటీసు నం. 13/26-27 (పేపర్ నోటిఫికేషన్)

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని బోయిన్‌పల్లి డివిజన్‌లో గల a) 11 KV కనజిగూడ ఫీడర్ (eMZ-20/26-27), b) 11 KV MDF ఫీడర్ (eMZ-21/26-27) మరియు c) 11 KV బాలానగర్ ఫీడర్ (eMZ-22/26-27) లను విభజించే పనుల కోసం అర్హులైన ఏజెన్సీల నుండి ఈ-టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. ఈ విషయానికి సంబంధించిన మరింత సమాచారాన్ని www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్), మెట్రో జోన్, హైదరాబాద్.

R.O. No. : 9434-PP/CL/ADVT/2026-27, Date: 07-09-2026

తెలంగాణ ప్రభుత్వం

ఫారం-VII

(Declaration) రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

NO. G2/1578/2025 తేది: 28.08.2026.
Gaz. No. 149/2026

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలములోని బొల్గాట్‌పల్లి గ్రామము వద్ద అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రంగాపూర్ కెనాల్ నిర్మాణ నిమిత్తము బొల్గాట్‌పల్లి గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.21.34 గుంటలు/సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రంగాపూర్ కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు.21.34 గుం॥ భూమి అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రంగాపూర్ కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము : బొల్గాట్‌పల్లి మండలం : అచ్చంపేట జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్.డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట/ తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు పేరు | చెట్లు సంఖ్య | నిర్మాణము వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 72 | పట్టా | మెట్ట | 1.27 | కాట్రావత్‌గిల్లు తండ్రి సోంలా(0.34) కాట్రావత్ లక్ష్మి భర్త గిల్లు(0.33) [illegible] | 73 | 40/1 | 40/1 | 37 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 71 | పట్టా | మెట్ట | 1.06 | కాట్రావత్ బద్రు తండ్రి లోక్య (1.06) | 76 | 72 | 70 | 74 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 70 | పట్టా | మెట్ట | 1.29 | కాట్రావత్ పత్య తండ్రి లోక్య (0.14) కాట్రావత్ హర్య [illegible] | 69 | 40/1 | 40/1 | 71 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 69 | పట్టా | మెట్ట | 1.16 | [illegible] | 81 | 70 | 40/1 | 76 | లేవు | లేవు | బావి | 1 |
| 5 | 68 | పట్టా | మెట్ట | 2.19 | [illegible] | 82 | 69 | 91/1 | 81 | లేవు | 3 | లేవు | లేవు |
| 6 | 91/1 | లావుని పట్టా | మెట్ట | 0.21 | కాట్రావత్ జమాని భర్త పూల్య (0.09) డొంకరోడ్ (0.12) సేనావత్ సీతా భర్త సోంలా బోడచంద్రయ్య తండ్రి పెద్దకాశన్న పీర్లవెంకటయ్య తండ్రి సాయిలు [illegible] | 90 | 40/1 | 67 | 68 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 67 | పట్టా | మెట్ట | 4.27 | [illegible] | 66 | 40/1 | 58 | 91/1 | లేవు | లేవు | బోరు | 1 |
| 8 | 56 | పట్టా | మెట్ట | 4.12 | [illegible] | 57 | 40/1 | 55 | 67 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 55 | పట్టా | మెట్ట | 1.05 | [illegible] | 49 | 40/1 | 54 | 57 | లేవు | లేవు | బోరు | 3 |
| 10 | 54 | పట్టా | మెట్ట | 1.29 | [illegible] సేనావత్ హేమ్యా తండ్రి మంచ్య సేనావత్ విజయ భర్త జగన్ | 50 | 40/1 | 53 | 55 | లేవు | లేవు | లేవు | లేవు |
| 11 | 53 | పట్టా | మెట్ట | 1.03 | సేనావత్‌సీతారాం తండ్రి చంద్య(1.03) సేనావత్ లక్ష్మి భర్త జగన్ కట్రావత్ శాంతి భర్త బాలు కట్రావత్ శాంతి భర్త లోక్య కట్రావత్ లోక్య తండ్రి వాల్య కట్రావత్‌రాజు తండ్రి కట్రావత్ బీక్యా బోడ పొట్టయ్య తండ్రి కరెయ్య బోడ మల్లేష్ తండ్రి బోడ కాశన్న బోడ రజిత భర్త బోడ మల్లేష్ నానావత్ శేఖి భర్త శ్రీరామ్ బోడ మల్లమ్మ భర్త బోడ పొట్టయ్య కట్రావత్ తిరుపతయ్య తండ్రి కట్రావత్ బీక్య | 52 | 40/1 | 40/1 | 54 | లేవు | లేవు | బోరు బావి | 1 1 |
| | | మొత్తం | | 21.34 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15(1) అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడంగానీ నిర్వాసితులుగా మారడం గాని మరియు భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్

సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్

సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 827/LA/PP/Advt/Pub/2026-27

## సభ్య సమాజం తలదించేలా బిఆర్ఎస్ పార్టీ చర్యల్ని

- సభాపతిపై అనుచిత వాక్యాన్ని ఖండిస్తున్నాం
- ప్రతిపక్ష నేత కెసిఆర్ క్షమాపణ చెప్పాలి
- భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఏలేటి ఏలేటి మహేశ్వర్ రెడ్డి వెల్లడి




**ఖానాపూర్ సెప్టెంబర్ 7(ప్రజా జ్యోతి) :** పవిత్ర అసెంబ్లీ సమావేశాలను నీరు కార్చే విధంగాను,సభను నడుపుతున్న గౌరవప్రద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా సభ్య సమాజం తలవంచుకునేలా ప్రవర్తించిన బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేల చర్యలను ఖండిస్తున్నామని సోమవారం వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే ఇలాంటి దుందుడుకు చర్యలు చేపట్టడం బాధాకరమని అసెంబ్లీ సాక్షిగా భారతీయ జనతా పార్టీ ప్రతిపక్ష నేత నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఘాటుగా స్పందించారు ఈ చర్యలకు పాల్పడిన బాధ్యులతో పాటు ప్రతిపక్ష నేతగా కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని అన్నారు ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి సభాపతికి సూచించారు ఈ మేరకు భారతీయ జనతా పార్టీ తరపున సభ్యుల తరపున స్పీకర్కు మద్దతు పలుకుతూ ప్రతిపక్ష బిఆర్ఎస్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నామని సభలో మహేష్ రెడ్డి స్పష్టం చేశారు.

## పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సర్పంచ్ సన్మానం



**తిర్యాణి, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు పంద్రం భగవంత్‌రావు పదవీ విరమణ పొందిన సందర్భంగా కన్నెపల్లి సర్పంచ్ తుమ్మరం మాన్కు ఆయన నివాసానికి వెళ్లి భగవంత్‌రావు దంపతులకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుమ్మరం మాన్కు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పిస్తూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎన్నో సంవత్సరాల పాటు సేవలందించి, విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసిన భగవంత్‌రావు సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భగవంత్‌రావు దంపతులు ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తూ భవిష్యత్తులోనూ సమాజానికి తమ అనుభవాలను అందించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అయన కోరుకున్నారు.


ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెడ్మ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిని ఖండిస్తూ బీఆర్ఎస్ ధర్నా




**మంచిర్యాల, 7, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ ప్రోత్సాహంతో అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ఆదేశాల మేరకు మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జిపై రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా నస్పూర్ పట్టణంలోని తోళ్లవాగు వద్ద నస్పూర్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా చేపట్టి అసెంబ్లీలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన తెలియజేస్తున్న ప్రజాప్రతినిధులపై పోలీసుల దాడి చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు

## 22వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**మంచిర్యాల, 7,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల నియోజకవర్గం పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేఖమ్మ గారు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అభినందిస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సురేఖమ్మ గారిని నాయకులు, కార్యకర్తలు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, టీపీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**







**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7, (ప్రజాజ్యోతి) :** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఒక సమస్య పరిష్కారానికి ఒకటి కంటే ఎక్కువ శాఖల ప్రమేయం ఉన్నప్పుడు ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు అందాయి. ప్రతి అర్జీని పరిశీలించి, అర్హత, నిబంధనల మేరకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

**సోన్, సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు బిఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేసి మా కుటుంబాలకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని సోన్ మండల ఎంపీడీవో కి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు సోన్ మండల్ కన్వీనర్ సాయి రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో నమ్మించి, అధికారంలోకి వచ్చిందని, వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పి వెయ్యి రోజులు పూర్తయిన, ఇప్పటిదాకా ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదని, అందువల్ల మా కుటుంబాలలోని ప్రతి ఒక్క అర్హులకు కింది ప్రయోజనాలను అందించాలని అన్నారు.

- ఆడబిడ్డలకి మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ" 2500 ఆర్థిక సహాయం తులం బంగారం, స్కూటీ అందించాలని,ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలి. – రైతన్నలందరికీ ప్రతి పంటకు రైతు భరోసా, కొరత లేకుండా ఎరువుల పంపిణీ, పంటలకు బోనస్, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్
- రైతు కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు సహాయం
- ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం తో పాటు ఇందిరమ్మ ఇల్లు
- అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగం, జాబ్ క్యాలెండర్ అమలు – విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు – వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన 4వేల పింఛన్



- ఆటో అన్నలకి సంవత్సరానికి 12000 రూపాయలు అందించాలి
- బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన, రైతు వంటి వర్గాలకు ఇచ్చిన అన్ని డిక్లరేషన్ల హామీలను అమలు చేయాలి.
- మా గ్రామం /పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ ఆగిపోయి మురికి కంపులో మునిగిపోయాయి. వెంటనే పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి
- ప్రభుత్వ హామీలను అడిగితే అక్రమ కేసులు పెడుతున్నారు. వీటిని ఆపాలి మా కుటుంబంలోని అర్హులైన ప్రతి సభ్యుడికి ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల ప్రకారం ప్రయోజనాలను అందించాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ సోన్ మండల ఇంచార్జ్ ఓం ప్రకాష్, నడిపి రాజేశ్వర్,బీస్ పోశెట్టి,మాధయ్ అనిల్, చిట్యాల దేవేందర్, మధుకర్, సురేష్ పలువురు బి ఆర్ ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

## ఖానాపూర్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్‌లలో నివసిస్తున్న అనర్హులను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కి వినతి

**సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ, పార్టీ శ్రేణులతో బాధితులు**





**ఖానాపూర్ సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో కొమురం భీమ్ చౌరస్తా లో గత ప్రభుత్వ హాయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లపై సమగ్రంగా త్వరగా విచారణ చేపట్టి అనర్హులను, తొలగించి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు కేటాయించాలని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా కి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రన్ని బాధితులతో కూడి సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న లు మాట్లాడుతూ గత ప్రభుత్వం భూమి, ఇండ్లు లేని నిరుపేదలకు కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో పంపకాలు చేసే క్రమంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అప్పటి పాలకులు, అధికా రులు ఎంపిక చేశారని ఆరోపించారుఎంపికలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని, గత కొన్ని సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. విచారణ పేరుతో సంవత్సరాలుగా కొనసాగుతుంది కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న తందంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందని ఇప్పటికైనాడబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల జాబితా పూర్తిగా పరిశీలించాలని, ప్రతి లబ్ధిదారున్ని అర్హత కుటుంబ వివరాలు సొంత ఇల్లు స్థలం ఆదాయం పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగించాలని, డిమాండ్ చేస్తున్నామన్నారు విచారణ పేరుతో కాలయాపన చేయకుండా నిర్ణీత పూర్తిస్థాయిలో విచారణ త్వరగా పూర్తిచేయాలని, అనర్హులను తొలగించి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూములు పంపిణీ చేయాలని, మున్సిపాలిటీలో డబుల్ బెడ్ రూమ్ ల ఆన్లైన్ ప్రక్రియను రద్దు చేయాలని, అనర్హులను తొలగించి తర్వాతే ఆన్ లైన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య సురేందర్, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డబుల్ బెడ్ రూమ్ ల సాధన కమిటీ కన్వీనర్ తోటరాద, కో కన్వీనర్ షేక్ గౌస్, మజ్జిత్, కల్పన లక్ష్మి గంగోత్రి సునీత శరీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా నుంచి 5 వేల మందికి తగ్గకుండా తరలిరావాలి
- టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి





**మంచిర్యాల, 7, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న గురువారం నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమ విజయవంతానికి సంబంధించి సోమవారం నస్పూర్‌లోని లిసమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లిలో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం చలో హైదరాబాద్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా నుంచి 5 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ హైదరాబాద్ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. టీజీఈజేఏసీ జిల్లా సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మంచిర్యాల జిల్లాలోని ప్రతి ఉద్యోగి చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి అండగా నిలవాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో మంచిర్యాల జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా పంచాయతీ అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి గణపతి, జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, కో-చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ అత్తే సుధాకర్, బొడ్డు శ్రావణ్, తంగళ్లపల్లి తిరుపతి, సత్యనారాయణ, ప్రభు తదితరులతో పాటు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్న సాదు రాజేందర్



**జన్నారం,సెప్టెంబర్7(ప్రజాజ్యోతి) :** జన్నారం మండల కేంద్రానికి చెందిన సాధు రాజేందర్ ఇంపాక్ట్ క్లబ్ ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్నారు.ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ రీజన్-19 నిర్మల్ అధ్యక్షులు లక్ష్మణ్ వాడేకర్ ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ 2.0 - బ్యాచ్ 290 రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.జాతీయ స్థాయి ట్రైనర్స్,కోచెస్ మరియు స్పీకర్స్ గా ఉదయ భాస్కర్,ఐసీఐ జేవీపీ రవికుమార్, హెడ్ బోర్డు మెంబర్ శ్యామ్ రాథోడ్, కోచ్ రామచంద్రుడు, మమత తదితరులు పాల్గొని శిక్షణార్థులకు విలువైన మార్గదర్శకత్వం అందించారు.ఇంపాక్ట్ ట్రైనర్స్ కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ రెండు రోజుల వర్క్ షాప్ లో రాజేందర్ సాధు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సర్టిఫైడ్ ట్రైనర్ గా గుర్తింపు పొందడంతో పాటు బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు ను కూడా అందుకున్నారు.

ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు, మెంటర్స్, కోచెస్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ప్రదర్శించిన ప్రతిభ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు శిక్షణ పట్ల చూపిన అంకితభావాన్ని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాను మరింత సమర్థవంతమైన ట్రైనర్‌గా, స్పీకర్‌గా ఎదిగి యువతకు మరియు సమాజానికి తన వంతు బాధ్యతలను నిర్వర్తించడమే తన ప్రధాన ఆశయమని తెలిపారు. యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు తన సేవలను అందిస్తానని పేర్కొన్నారు.సర్టిఫైడ్ ట్రైనర్ గా మరియు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు గ్రహీతగా ఆయన సాధించిన ఈ ఘనత పట్ల పలువురు ప్రముఖులు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## మండలాధికారులకు బిఆర్ఎస్ నాయకుల మెమోరాండం



**సోనాల, సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి) :** ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో పాటు ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పి వెయ్యి రోజుల 1000 పాలన గడిచిపోయిన ఇప్పటికి హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం వైఫల్యం చెందిన సందర్భంగా సొనాల బిఆర్ఎస్ నాయకులు ఎమ్మార్వో, ఎంపీడీవోలకు విజ్ఞాన పత్రం అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సొనాల సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి సొనాల పట్టణ అధ్యక్షులు చిన్నయ్య, అభిలాష్, హరీష్, అఖిల్, రమేష్, ప్రదీప్, రాజన్న, సుగుణకర్, శరత్,గణేష్, పంచాక్షరీ,తదితరులు పాల్గొన్నారు.

## 420 హామీలు.. అమలెప్పుడు?

- ఎన్నికల హామీలను నెరవేర్చాలి
- ప్రజావాణిలో బీఆర్ఎస్ నేతల వినతి



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 7 ప్రజా జ్యోతి :** జిల్లా క్రైమ్ రిపోర్టర్ : మున్నా ఖాన్. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వాంకిడి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను గుర్తించి, వాటి అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. హామీలకు అర్హులైన ప్రజలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి పారుపల్లి అజయ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ జాబోరె పెంటూ, సర్పంచ్ చునర్కర్ సతీష్, మాజీ సర్పంచ్ తుకారాం, యువజన అధ్యక్షుడు రాకేష్‌కుమార్, బీఆర్ఎస్వీ నాయకులు రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, నాయకులు రాము, సోయం సంజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఇయరింగ్ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్



**జన్నారం,సెప్టెంబర్7(ప్రజాజ్యోతి) :** ఓటర్ నమోదు సవరణలో భాగంగా పొనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న సర్ ఇయరింగ్ ప్రక్రియను సోమవారం తహసిల్దార్ బక్కయ్య పరిశీలించారు. సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్నవారు,ప్రభుత్వం తెలిపిన పత్రాలను అందచేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు గుర్తించి వారి ఓటు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్, ఉప సర్పంచ్ అప్పల జలపతి, ఆర్ ఐ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక





**జన్నారం, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జిల్లా ఇన్చార్జ్ లింగంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన్నారం మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా గొనె ప్రభాకర్ మాదిగ,అధికార ప్రతినిధిగా కొండుకూరి ప్రశాంత్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా దుమల్ల ప్రవీణ్ మాదిగ,ఉపాధ్యక్షులుగా ఉపారపు శేఖర్ మాదిగలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి కొండుకూరి ప్రభుదాస్ మాదిగ, జిల్లా నాయకులు మామిడిపెల్లి ఇందయ్య మాదిగ, దుమల్ల రమేష్ మాదిగ, సత్యనారాయణ మాదిగ, మంద రాజేష్ మాదిగ, దుమల్ల ఎల్లయ్య మాదిగ,కత్తెర పాక రాజేష్ మాదిగ, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజావాణి అర్జీలను సకాలంలో పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా





కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజావాణికి ఈ వారం మొత్తం 34 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.జిల్లా స్థాయి ప్రజావాణిలో 98,మండల స్థాయి ప్రజావాణిలో 247 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని,వాటన్నింటినీ సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ప్రభుత్వం ప్రజావాణికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,చీఫ్ సెక్రటరీ స్థాయిలోనూ సమీక్ష జరుగుతున్నందున అధికారులు అలసత్వం వహించకూడదని సూచించారు.విద్యుత్ శాఖకు సంబంధించి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఎస్ఈ,డీఈ,ఏడీఈ,ఏఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని,అధికారులు అప్రమత్తంగా ఉండి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మంజుల,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయి?..

### హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ సర్కార్
### వనపర్తి కలెక్టరేట్ ముందు బీఆర్ఎస్ మెరుపు ధర్నా

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 07(సాక్ష్యం):
ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిరాశకు గురయ్యారని బీఆర్ఎస్ నాయకులు వాకిటిశ్రీధర్,రమేష్ గౌడ్,నందిమల్ల అశోక్ లు విమర్శించారు.బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయడానికి బయలుదేరితే రేవంత్ రెడ్డి అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో




బిఆర్ఎస్ నాయకులు ర్యాలీగా వెళ్లి వనపర్తి కలెక్టరేట్ ముందు మెరుపు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్రమంగా అరెస్టు చేసిన బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, వృద్ధులకు రూ.4,000, బీడీ కార్మికులకు పెన్షన్ వంటి హామీలు అమలు కాలేదని, ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో పంటలు ఎండిపోయే ప్రమాదం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కనీసం తొమ్మిది గంటలు కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావడం లేదని వారు ఆరోపించారు.కేసీఆర్ ఆలోచన మేరకు, కేటీఆర్ దిశానిర్దేశంతో హామీల అమలుపై నిరసనలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గంధంపరంజ్యోతి, కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్ మహిళా నాయకులు కవితా నాయక్, షేమిం బేగం,సీనియర్ నాయకులు ప్రేమ నాథ్ రెడ్డి,బండారుకృష్ణ,నాగన్నయాదవ్,రఘువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 61116 మంది ఓటర్లకు నోటీసులు

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 07(సాక్ష్యం):
వనపర్తి జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 లో భాగంగా 88727 నోటీసులకు గాను 61116 మంది ఓటర్లకు నోటీసులు అందజేయడం పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.సోమవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా అనామలీస్, అన్ మ్యాపింగ్ జాబితాలో నోటీసులు జనరేట్ అయిన వారికి నోటీసులు




అందజేత, హియరింగ్ నిర్వహణ, ఆమోదించిన దరఖాస్తులపై రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అనామలీస్, అన్ మ్యాపింగ్ జాబితాలో నోటీసులు నమోదు అయిన వాటిని సంబంధిత ఓటర్లకు అందజేసే ప్రక్రియ వేగవంతం చేయాలని సి.ఈ.ఒ ఆదేశించారు.నోటీసులు అందుకున్న వారికి హియరింగ్ జరిపి వారు ఇచ్చిన డాక్యుమెంట్లను బి.ఎల్.ఒ ల ద్వారా అప్లోడ్ చేసిన అనంతరం డాటా ఎంట్రీ చేయించే ప్రక్రియ సైతం వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వివరిస్తూ వనపర్తి జిల్లాలో ఇప్పటి వరకు 61,116 వేల నోటీసులు సంబంధిత ఓటర్లకు అందజేయడం జరిగిందని, అదేవిధంగా 4757 హియరింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల అథారిటి సూచించిన నిబంధనల ప్రకారం హియరింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలియజేసారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ టి వినోద్ కుమార్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు వి. సి.లో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 17 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

గద్వాల సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు సోమవారం 17 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ,సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.బాధితులకు ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజల నమ్మకమే పోలీస్ శాఖకు అత్యంత ముఖ్యమన్నారు.ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు పని దినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.భూ వివాదాలు, ఆస్తి



సమస్యలు,కుటుంబ కలహాలు తదితర అంశాల్లో చట్టపరమైన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.సోమవారం అందిన 17 ఫిర్యాదుల్లో భర్త వేధింపులకు సంబంధించి ఒకటి,గొడవలకు రెండు,భూ వివాదాలకు రెండు,కుటుంబ వివాదాలకు రెండు,స్థలం ఆక్రమణకు ఒకటి,ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారనే ఫిర్యాదు ఒకటి,సీడ్ పత్తి విత్తనాల డబ్బులు చెల్లించడం లేదనే ఫిర్యాదులు మూడు,ఇతర సమస్యలకు సంబంధించినవి ఐదు ఉన్నాయి.ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతరం సమీక్ష చేస్తూ ప్రజలకు పారదర్శకమైన,వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని ఎస్పీ తెలిపారు.

## నాడు ఫ్రెండ్లీ పోలీస్.. నేడు రేవంత్ పోలీస్!

- ఆరు గ్యారంటీలు.. 420 హామీలు వెంటనే అమలు చేయాలి
- హామీలు గుర్తు చేస్తే కేసులా? ప్రజల గొంతు ఎలా అణచివేస్తారు?
- కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ భారీ ర్యాలీ.. కలెక్టర్‌కు వినతిపత్రం

నారాయణపేట, సెప్టెంబర్ 7 (సాక్ష్యం ప్రతినిధి):
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు, వృద్ధులు, వికలాంగులు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం మా బాధ్యత.. వాటిని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే పోలీసులు కేసులు నమోదు చేయడం, ప్రతిపక్షాల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. తప్పుబట్టారు. "టీషర్టులపై హామీలు రాసుకున్న ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవచ్చు.. కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్న ఆ హామీలను ఎలా అడ్డుకుంటారు?" అని ప్రశ్నించారు. కేసులతో ప్రశ్నించే గొంతులను అణచివేయలేరని, హామీల అమలు కోసం బీఆర్ఎస్ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడ◌ుతుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి హామీల అమలుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్‌లోని సమాచార





బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హామీల అమలును గుర్తు చేస్తూ సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. యాద్గీర్ రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే నివాసం నుంచి కలెక్టరేట్ వరకు డప్పు వాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ "ప్రజల గుండెల్లో ఉన్న హామీలను పోలీసులు ఎలా అడ్డుకుంటారు?" బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థను 'ఫ్రెండ్లీ పోలీస్'గా ప్రజలకు చేరువ చేస్తే, కాంగ్రెస్ పాలనలో అది 'రేవంత్ పోలీస్'గా మారిపోయిందని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలనే టీషర్టులపై రాసుకుని అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన బోర్డుపై అధికారుల పేర్లు కాగితాలపై రాసి ఉండటం, పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగడం, తాగునీటి సదుపాయం లేకపోవడంపై రాజేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ర్యాలీలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి రైతు కుటుంబానికి స్థిర ఆదాయం

### సమగ్ర ప్రణాళికలతో కరువు నివారణకు చర్యలు: కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, సెప్టెంబర్ 7 (సాక్ష్యం ప్రతినిధి):
గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వనరులు




కల్పించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో డ్రాట్ మిటిగేషన్ (కరువు నివారణ) కార్యక్రమంపై నిర్వహించిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న డ్రాట్ మిటిగేషన్ కార్యక్రమానికి నారాయణపేట జిల్లాలో ఉట్కూర్ మండలం ఎంపికైంది. కార్యక్రమ అమలు బాధ్యతను వాసన్ సంస్థ చేపట్టగా, సమావేశంలో సంస్థ ప్రతినిధులు డీపీఆర్‌ను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, పౌల్ట్రీ, డెయిరీ, గొర్రెలు, మేకల పెంపకం వంటి లైవ్‌స్టాక్ రంగాలను ప్రణాళికలో అనుసంధానం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్, సాంకేతిక సహాయం, శిక్షణ, వెటర్నరీ సేవలు, మార్కెట్ లింకేజీ అందేలా సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కో చోట ఒక్క యూనిట్ ఏర్పాటు చేసి వదిలేయకుండా ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు పూర్తి విలువ గొలుసు అభివృద్ధి చేయాలని తెలిపారు. ముడి సరుకులు, ఉత్పత్తి, సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ అంశాలను సమన్వయం చేయాలన్నారు. ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీవోలు) మరింత బలోపేతం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే కొత్త ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేయాలని సూచించారు. వాటికి ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్, వర్కింగ్ క్యాపిటల్, సాంకేతిక సహాయం అందించాలని తెలిపారు. ప్రతి కుటుంబం అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా తగిన ఎంటర్‌ప్రైజ్‌ను గుర్తించి, ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలు, మార్కెట్ సంస్థల సహకారంతో అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది, దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబానికి ఆదాయం అందించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. "ఒక గ్రామం–ఒక సమగ్ర ప్రణాళిక–ప్రతి కుటుంబానికి ప్రయోజనం–స్థిరమైన ఆదాయం" లక్ష్యంతో ప్రణాళికలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కార్యక్రమ నోడల్ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్, వాసన్ సంస్థ ప్రతినిధులు అనిల్ ఉప్పలపాటి, బక్కారెడ్డి, లక్ష్మణ్, మండల వ్యవసాయ శాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం - శిథిల భవనంలోనే తరగతులు: నూతన కళాశాల కోసం పిడిఎస్‌యు డిమాండ్

నారాయణపేట, సెప్టెంబర్ 7 (సాక్ష్యం ప్రతినిధి):
నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనాన్ని వెంటనే కూల్చివేసి, నూతన భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.




ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కొనసాగుతున్న కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి భవనంలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిరోజూ విధులకు హాజరవుతూ చదువులు కొనసాగించడం ఆందోళనకరమన్నారు. భవనం పరిస్థితిపై పలుమార్లు అధికారుల, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి శిథిల భవనాన్ని తొలగించి, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు నందిని, పరశురాం, విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై గౌరీశంకర్ సత్తా

నారాయణపేట, సెప్టెంబర్ 7(సాక్ష్యం ప్రతినిధి):
ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు బడుగు గౌరీశంకర్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన సౌత్ ఏషియన్ డ్రిఫ్ట్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ ప్రియాంక గౌరీశంకర్‌ను అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు అంతర్జాతీయ వేదికపై ప్రతిభ కనబరిచి పతకం సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని తమ ప్రతిభను వెలికితీయాలని కలెక్టర్ సూచించారు. క్రీడల్లో రాణించే యువతకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ కోతలపై కదం తొక్కిన రైతులు...

వనపర్తి ప్రతినిధి,సెప్టెంబర్ 07(సాక్ష్యం):
వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ వనపర్తి మండలం రాజపేట, పెద్దతాండా గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు సోమవారం రాజపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి,రాస్తారోకో చేపట్టారు.విద్యుత్ కోతల కారణంగా పంటలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జయరాములు నాయక్ మాట్లాడుతూ..పంటలు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.కరెంట్ కోతలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోం" అని నాయకులు, రైతులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు కల్కి తిరుపతయ్య, జాన్య నాయక్, నార్య నాయక్, సురేష్, బిచ్చా నాయక్, లోక్య నాయక్, రాహుల్, బక్క బాలరాజు తదితర గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



## వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు

### గణేష్ మండపాల్లో అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలి: ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట, సెప్టెంబర్ 7 (సాక్ష్యం ప్రతినిధి):
తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వాల్ పోస్టర్‌ను సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ ఆవిష్కరించారు. 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు వినూత్నంగా సూచనలు పొందుపరిచారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్‌లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద ఈ పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని మండప నిర్వాహకులకు సూచించారు. తెలియని ఫోన్‌కాల్స్, సందేశాలు, ఈ–మెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దన్నారు. బ్యాంకు వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దన్నారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని, ఖాతాల భద్రతకు బలమైన పాస్‌వర్డ్‌లు, ద్వంద్వ ధృవీకరణను వినియోగించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే నగదు తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ



ఆధ్వర్యంలో నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పేట ఇన్‌చార్జి సైబర్ క్రైమ్ డీఎస్పీ కాజల్ జస్వాల్, ఆర్ఐ విజయభాస్కర్, జిల్లా సైబర్ టీం పోలీసులు రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ హౌస్ అరెస్టులతో మా గొంతు నొక్కలేరు

– డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి






**నర్సంపేట సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకుల, కార్యకర్తల గొంతు నొక్కేందుకు అక్రమ హౌస్ అరెస్టులకు పాల్పడటం అప్రజా స్వామిక చర్య అని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ పైనే తిరగబడిన చరిత్ర మాది. బీజేపీ నాయకుల, కార్యకర్తలను అక్రమంగా హౌస్ అరెస్టులు చేయడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు వరంగల్ లో తన స్వగృహంలో తనను నర్సంపేట నియోజకవర్గం లోని బిజెపి నాయకులను అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఇది కాంగ్రెస్, ప్రభుత్వదౌర్జన్యానికి, అహంకారానికి పరాకాష్ట అని అన్నారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలరాయలేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న బీజేపీ నాయకులు,కార్యకర్తలను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును రేవంత్ రెడ్డి ఆపలేరు. పోలీసులతో అక్రమ నిర్బంధాలు చేయించొచ్చు కానీ ప్రజా సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటాన్ని మాత్రం ఆపలేరు అని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో సమస్యలు పరిష్కారం కాదు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిందే.

## కన్నాయిగూడెంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన.. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**కన్నాయిగూడెం, సెప్టెంబర్ 7(ప్రజాజ్యోతి) :** కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టులకు నిరసనగా, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతల గొంతు నొక్కే ప్రయత్నాలను నిరసిస్తూ ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం తమ హక్కు అని, ప్రజల గొంతుకగా నిలబడటం తమ బాధ్యత అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, వారి గొంతును అణిచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని, బీఆర్ఎస్ గొంతు నొక్కే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అడుగుపెట్టకుండా అడ్డుకున్నా ప్రజల మధ్య బీఆర్ఎస్ అడుగులను ఆపలేరని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కావిరి చిన్నికృష్ణ, పూజారి కిషోర్, మఠం వెంకటేష్, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మావురిగారి వెంకటయ్య, యూత్ నాయకులు దుర్గం రాజేష్, చింతగూడెం మాజీ సర్పంచ్ దుర్గం నారాయణతో పాటు శ్రీరాముల సందీప్, కావిరి నర్సింహారావు, చిలుముల రాంబాబు, కావిరి సంతోష్, సునరకని సుధాకర్, గోస్కుల శ్రీనివాస్, జనగాం సత్యం, జనగాం లక్ష్మీపతి, కనకసేను, జాడి రాజబాబు, తడకల జగన్, తొంగలి సుమన్, శ్రీరాముల వెంకన్న, వాసంపెల్లి సురేష్, వాసంపెల్లి లక్ష్మీనారాయణ, టి. రామారావు, పాలకుర్తి వెంకన్న, తడకల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



### ఎన్నికల హామీల నెరవేర్చాలంటూ

## నర్సంపేట ఎంపీడీవోకు వినతి పత్రం

– బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి – ఈర్ల నరసింహా రాములు



**నర్సంపేట సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట 2023 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల 420 హామీలు,ఆరు గ్యారంటీలు. నెరవేర్చాలని మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు ప్రసంగిస్తూ 2023 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేదిక్కించుకొనుటకుగాను అణువు గాని అబద్ధపు హామీలు 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, కాలయాపన చేస్తున్నారు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు,ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా,గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి కొనసాగింపుగా వచ్చిన, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నటువంటి పథకాలను నిలిపివేశారు అర్హులైన లబ్ధిదారులను మోసం చేశారు,మోసం చేస్తున్నారు. ఒకసారి కాంగ్రెస్ పార్టీ వారు హామీలతో మోసం చేసిన జాబితాను పరిశీలించినట్లయితే వృద్ధులు,మహిళలు,రైతులు, విద్యార్థిని విద్యార్థులు, గర్భిణీ స్త్రీలు,పుట్టిన పిల్లలు,ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు,ఆటో కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్మెంట్ అయిన వారు, నిరుద్యోగులు ,కాంట్రాక్టర్లు, సర్పంచ్లు, వార్డు మెంబర్లు, బీసీలు ,ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు,వివాహిత మహిళలు ఇలా చెప్పుకుంటూ పోతే నిరుపేద మధ్య తరగతి కుటుంబాలను సకల వర్గాలను, సకల కులాలను,సకల మతాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిన మాట వాస్తవం. కావున కాంగ్రెస్ ప్రభుత్వం వారు ఇచ్చిన హామీలు పథకాలు మోసపోయిన వర్గాలు ఈరోజు మేల్కొన్నాయని మోసం చేసిన కాంగ్రెస్కు గుణపాఠం చెప్తారని నర్సింహ రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత అధికారులతో చర్చించి ,సంప్రదించి అన్ని వర్గాల ప్రజలకు అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలాగా చూడాలని ముఖ్యంగా రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ, డిక్లరేషన్, మైనారిటీ డిక్లరేషన్ ఇంకా ఎన్నో హామీలు ఎన్నో అబద్ధాలు ఎన్నో మోసాలు అన్నింటి మీద తగు విచారణ జరిపి ప్రజలందరికీ న్యాయం చేయాలని సబండ వర్గాల సకలజనుల తరఫున బి ఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జులు,మోటూరి రవి, వల్లాల కర్ణాకర్,సర్పంచులు మిట్ట కడుపుల లక్ష్మి చిరంజీవి, బానోతు సురేష్ ,మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, సీనియర్ నాయకులు బండారు రమేష్,బీరం మాధవరెడ్డి అల్లే రవికుమార్ ,పెండ్యాల మునేందర్,మండల యూత్ అధ్యక్షులు గన్న రాజేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల స్వామి,మాజీ సర్పంచులు గోడిశాల రాంబాబు, బోడిగే శ్రీనివాస్,భానోత్ శంకర్ నాయకులు పెండ్యాల బిక్షపతి, కత్తుల కుమారస్వామి,మామిడి ఐలయ్య బయ్య నవీన్ చిన్న పెల్లి నర్సింగం,పత్రి కుమారస్వామి,పురాని రవీందర్,తుత్తూరు వెంకటేష్, జాటోత్ బాలాజీ,నూనావత్ పవన్,బాధావత్ బద్దు,జాటోత్ రవి దారావతు విజయ్,మాట్ల రాజు,చుండు ప్రశాంత్,చుండు రాము శీలం రవి బానోతు శ్రీనివాస్,హటవత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

– పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

– కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్.రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించే గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీవోపీ, రసాయన రంగులతో తయారైన విగ్రహాల నిమజ్జనం ద్వారా నీటి కాలుష్యం ఏర్పడి పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. సహజంగా నీటిలో కలిసిపోయే మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరులు, ప్రకృతిని కాపాడవచ్చన్నారు. భక్తి భావంతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ టీజీపీసీబీ నోడల్ అధికారి బి.జీమూతవాహన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

### గుట్టపై గుహలో కొలువైన లక్కాకులమ్మ..

## కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం!

- సంతాన భాగ్యం ప్రసాదించే తల్లిగా భక్తుల నమ్మకం..
- కోరికలతో వచ్చే భక్తులకు కొండంత ధైర్యం..
- బండరాయి గర్భంలో వెలసిన దైవశక్తి..
- ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు





**భీమదేవరపల్లి, సెప్టెంబరు 07 ప్రజా జ్యోతి :** పచ్చని పొలాల నడుమ.. ఎత్తైన గుట్టపై భారీ బండరాయిలో ఏర్పడిన సహజసిద్ధమైన గుహలో కొలువైన లక్కాకులమ్మ.. భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామంలోని ఈ అమ్మవారి క్షేత్రానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా సంతానం లేని దంపతులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో వేడుకుని మొక్కులు మొక్కితే సంతాన భాగ్యం కలుగుతుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోరిన కోరికలు నెరవేర్చే తల్లిగా లక్కాకులమ్మను భక్తులు కొలుస్తున్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన భారీ బండరాయి లోపలి గుహలో అమ్మవారు వెలసి ఉండటం ఈ క్షేత్ర ప్రత్యేకత. ప్రశాంతమైన ప్రకృతి ఒడిలో, పచ్చని పొలాల మధ్య గుట్టపై ఉన్న ఈ ఆలయానికి 3 రోజుల పాటు భక్తుల రాక కొనసాగుతూనే ఉంటుంది. సిద్దిపేట, హుస్నాబాద్, కరీంనగర్, హనుమకొండ, హుజూరాబాద్, కాజీపేటతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. తమ మనసులోని కోరికలను అమ్మవారికి విన్నవించుకుని ముడుపులు కడితే తప్పకుండా ఫలితం ఉంటుందని భక్తులు విశ్వసిస్తున్నారు. దీంతో ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడనుంది.

**మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు :** ఈ నెల 9న శ్రీ మహాగణపతి పూజతో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, స్వస్తి పుణ్యాహవాచనం నిర్వహించనున్నారు. త్రయాహ్నిక దీక్షలో భాగంగా శక్తి హోమం, అఖండ దీపారాధన, నవగ్రహ, అష్టదిక్పాలక, ఆవరణ దేవతల పూజలు నిర్వహించి ఉదయం బోనం సమర్పించనున్నారు. 10న గురువారం అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామార్చనలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులు అమ్మవారికి ముడుపులు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరిస్తారు. 11న శుక్రవారం అమ్మవారికి విశేష అలంకరణ, అష్టోత్తర సహస్రనామార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముడుపుల సమర్పణతో పాటు భక్తులకు తీర్థప్రసాద వితరణ జరుగుతుంది.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి : ప్రస్తుతం లక్కాకులమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర క్షేత్ర అభివృద్ధికి భక్తులు తమ శక్తి మేరకు ధన, వస్తు రూపంలో సహకరించి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని దేవాలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రకృతి ఒడిలో గుట్టపై కొలువైన లక్కాకులమ్మ దర్శనానికి తరలివచ్చి, అమ్మవారి కృపాకటాక్షాలను పొందాలని భక్తులకు నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలలో జాప్యనికి నిరసనగా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నాయకులు





**రాయపర్తి సెప్టెంబర్ 7 ప్రజా జ్యోతి :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పోరాట కార్యక్రమాలలో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో రాయపర్తి బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల పై వినతి పత్రం ఇచ్చిన రాయపర్తి మండల పార్టీ మాజీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, పిఎసిఎస్ చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి, మాజీ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు గాజులపాటి నర్మద, మండల పార్టీ నాయకులు కర్ర రవీందర్ రెడ్డి, లేతకుల రంగా రెడ్డి, గారే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాటారం సబ్ కలెక్టర్



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం నూతన సబ్ కలెక్టర్‌గా నియమితులైన సౌరబ్ శర్మ సోమవారం ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందచేశారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా జిల్లా కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్, కాటారం డివిజన్‌లో పాలనాపరమైన అంశాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాటారం డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

## విద్యార్థుల ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి..

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్..




**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ప్రజాజ్యోతి :** విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద ఆందోళన, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ఇప్పటి వరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలువురు విద్యార్థులు పై తరగతులకు వెళ్లలేక చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడిందని నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి కనీసం ఒక్కరోజైనా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు.

అదేవిధంగా నిరుద్యోగులకు ప్రభుత్వం సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే గత ప్రభుత్వాలకు పట్టిన గతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పడుతుందని మంద నరేష్ హెచ్చరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ఏబీఎస్ఎఫ్ నాయకులు ప్రయత్నించగా, కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు బండారి శ్రీనివాస్, అర్షం రాహుల్, రాంకిరణ్, సాయి, శ్రీను, వెంకటేష్, సూర్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి...చలో హైదరాబాద్

– మహాధర్నాను విజయవంతం చేయాలి – ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గాజే వేణుగోపాల్



**రాయపర్తి సెప్టెంబర్ 7 ప్రజా జ్యోతి :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈజెఏసి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10, 2026 న నిర్వహించనున్న చలో హైదరాబాద్ – మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని (టిజిఈజేఏసి)వరంగల్ జిల్లా కమిటీ సోమవారం పిలుపునిచ్చింది. చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయడానికి సంబంధించి సన్నాహక సమావేశం, పోస్టర్ ఆవిష్కరణ సోమవారం రాయపర్తి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా టి జీ ఈ జేఏసీ జిల్లా చైర్మన్ గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు :** 2వ వేతన సవరణ సంఘం (2వ పి ఆర్ సి) నివేదికను వెంటనే అమలు చేసి, 01.07.2023 నుండి 51% ఫిట్‌మెంట్ మంజూరు చేయాలి. – ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి. – సుమారు రూ.10,000 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులను వెంటనే చెల్లించాలి.

– ప్రతి నెలా కనీసం రూ.2,000 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. – సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్)ను పునరుద్ధరించాలి. – ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎన్ ఈ హెచ్ ఎస్ (న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం)ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. – ఉద్యోగ సంఘాలకు గుర్తింపు పునరుద్ధరించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘాలతో చర్చలు జరపాలి. – ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లలో చలో హైదరాబాద్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తూ సన్నాహక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టిజిఈజేఏసి నాయకులు తెలిపారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు పెన్షనర్లు ఎదురుకొంటున్న సమస్యలు కేవలం వ్యక్తిగత సమస్యలు కాదని, లక్షలాది కుటుంబాలకు సంబంధించినది అని నాయకులు పేరుకొన్నారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ – మహా ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టిజిఈ జేఏసి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తూ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదా నందం కోశాధికారి అంచ కిరణ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాటికాయల కుమార్ సుజన్ ప్రసాద్ ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు మధు లేమియా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ జిల్లా అధ్యక్షులు గోవిందరావు మహేందర్ రెడ్డి టిఆర్టిఎఫ్ తాళ్లపల్లి రాజు పంచాయతీ సెక్రెటరీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ సిటీ అధ్యక్షులు శశీకేషి రాజేష్, ఎంపీడీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు పాక శ్రీనివాసులు, పంచా యతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుగులోత్ యాకుబ్ నాయక్, రాయపర్తి మండలం టీచర్ల యూని యన్ నాయకులు, రాయపర్తి మండల పంచాయతీ కార్యదర్శిల అధ్యక్షులు రాకేష్, ప్రధాన కార్యదర్శి మోయనుద్దీన్ మరియు ఇతర శాఖల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కై వినతిపత్రం



**మునగాల సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి) :** విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని మండల పరిధిలోని గణపవరం గ్రామంలో కొన్ని సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న ఎస్సీ కాల నీలో వాటర్ ప్లాంట్, కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం గ్రామంలోని యువతకు అవసరమైన పుస్తకాలు మరియు మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరేపల్లి ఉప్పలయ్య, సూరేపల్లి రమేష్, నెమ్మది ప్రియాంక, మాతంగి జయమ్మ, సీతారామయ్య, సూరేపల్లి శ్రీను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపిటిసి చిరుమర్తి యాదయ్య



**నార్కట్ పల్లి, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య డిమాండ్ చేశారు. నార్కట్ పల్లి మండల ప్రజావాణిలో మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు కలిసి ఎమ్మార్వో, ఎంపీడీవోలకు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల విశ్వాసాలను నిలబెట్టుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుబ్బాక శ్రీధర్ యాదవ్, యానాల అశోక్ రెడ్డి, కర్నాటి ఉపేందర్, దుబ్బ రవి, పనస వెంకన్న, దోసపాటి విష్ణు, మేకల కరుణాకర్ రెడ్డి, వాజిద్ అలీ, నడింపల్లి నరేష్, బోయపల్లి శ్రీనివాస్, పుల్లెంల వెంకట్, మహేష్, సుధాకర్, నాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీలో అవినీతి





**వలిగొండ సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి) :** వలిగొండ మండల కేంద్రంలోని సుమేధ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ తీసుకొని బరువు తక్కువగా ఉన్నది అనే సందేహంతో వినియోగదారుడు అయిన బి.జె.పి జిల్లా సీనియర్ నాయకుడు బంధారపు రాములు గ్యాస్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి ఏజెన్సీ సిబ్బంది ముందే తనిఖీ చెయ్యగా 2.50 కిలోల బరువు తక్కువ రావడం జరిగింది.సిలిండర్ లో ఎటువంటి సమస్య లేదు అని మాకు ఎం తెలియదు ఇండియన్ గ్యాస్ కంపెనీ నుండి అలానే వస్తుంది అని మేనేజర్ తెలియజేసారు. సాధారణంగా సిలిండర్ డెలివరీ సమయంలో బరువు పరిశీలించిన తర్వాతే వినియోగదారులకు అందించాల్సి ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో తూకం వేయకుండానే సిలిండర్‌ను ఇంటి వద్ద దింపి వెళ్తున్నారు చెప్పగా మేనేజర్ వంశీ నిర్లక్ష్య ధోరణికి వ్యక్తం చేశారు.2 గంటల నిరీక్షణ తరువాత తనిఖీ చెయ్యడానికి అని రాకేష్ అనే వ్యక్తి వచ్చి తనిఖీ చేసి వచ్చర్ బాగోలేదు అని చెప్పాడు.మెకానిక్ మండలంలో సిలిండర్లు డెలివరీ చేసే వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం.నిజానికి మండలంలోని దళారులు ఏజెన్సీ కూటమిగా అయి అవినీతికి పాల్పడుతున్నారు.ఆఫీస్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఎటువంటి డెలివరీ చార్జీలు తీసుకోకూడదు అయిన కానీ ప్రజల వద్ద దౌర్జన్యంగా తీసుకుంటున్నారు.ప్రజలకు నిత్యవసరం అయిన గ్యాస్ ఏజెన్సీలో ఎంతో కాలంగా జరుగుతున్న అవినీతిపై అధికారుల నిర్లక్ష్య ధోరణి గురించి ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఏర్పడుతున్నాయని అని అన్నారు.

## హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో





**నకిరేకల్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** హైదరాబాద్ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరిగిన అరెస్టులు, దాడులకు నిరసనగా నకిరేకల్ పట్టణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై ఉత్సవాలు నిర్వహించే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించి, ఇకనైనా హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు.

## ఎమ్మెల్సీ తాత మధు మాటల వెనుక కేసీఆర్, కేటీఆర్‌ల హస్తముంది

- తక్షణమే ఎమ్మెల్సీ రద్దు చేయాలి - బిఆర్ఎస్ అహంకారపు వైఖరికి నిరసనగా నేడు నిరసన ర్యాలీ
- కాంగ్రెస్ నాయకుల వెల్లడి





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన మాటలను మిర్యాల గూడ కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని,ఈ మాటల వెనుక ఉన్న కెసిఆర్, కేటీఆర్ ల హస్తం ఉందని దిలావర్ పురు సర్పంచ్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హరీష్ రావు, పాడి కౌశిక్ రెడ్డి, నవీన్ రెడ్డిల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు . ఏ భారత రాజ్యాంగం మీద ప్రమాణ స్వీకారం చేశారో ఆ భారత రాజ్యాంగం ప్రకారం స్పీకర్గా ఎన్నికైన వ్యక్తిని పట్టుకొని స్పీకర్ గాడు అని, అలాగే వారి చనిపోయిన తల్లిని కూడా అవమానపరిచే విధంగా మాట్లాడిన మాటలు యావత్ దళిత సమాజాన్ని కించపరిచిన మాటలుగా భావిస్తున్నామన్నారు. తక్షణమే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిని శాసనమండలి నుండి శాశ్వతంగాతొలగించాలని,మళ్లీ ఎప్పుడు కూడా ఎన్నికలలో పోటీ చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

**నేడు నిరసన ర్యాలీ :** టిఆర్ఎస్ నేతల తీరుకు నిరసనగా మంగళవారం(నేడు) దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. దళితుల ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు జరిగే ఈ నిరసన కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, మిర్యాలగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్ గౌడ్, వన్ టౌన్, టు టౌన్ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్,మోయిజ్ సర్పంచ ధనావత్ సిద్దు నాయక్,భాష నాయక్ రవి నాయక్, కౌన్సిలర్లు దైద సోమ సుందర్, శ్రీజ స్వప్న, దేశిడి శేఖర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఉబ్బపల్లి కాశయ్య, జిందా, తలకొప్పుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వెయ్యిరోజుల పాలనపై ప్రజావాణి లో విజ్ఞాపన పత్రం



**నాగారం సెప్టెంబర్ 07 ప్రజా జ్యోతి :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి అయిన సందర్భంగా సోమవారం నాగారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజులధగా పాలనపై నాగారం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణి లో విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగింది. విజ్ఞాపనపత్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అయినటువంటి 420 హామీలు 13డిక్లరేషన్ లు 6గ్యారంటీలు వంద రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. అమలు కానీ వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు మహిళలకు 2500 కల్యాణలక్ష్మి కింద తులం బంగారం విద్యార్థినులకు స్కూటీలు రైతు కూలీలకు 12000 నిరుద్యోగ భృతి జాబ్ క్యాలెండరు 4000పెన్షన్ ఎరువుల కొరత లేకుండా వ్యవసాయనికి 24గంటల నిరంతర ఉచిత విద్యుత్ మరియు ప్రతి పంటకు రైతు భరోసా అందించాలని ఆటో డ్రైవరన్నలకి 12000 అందిచలని ప్రభుత్వ హామీలు అడిగిన వారి పై అక్రమ కేసులు పెడుతున్నారని వెంటనే వీటిని ఆపాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కళ్లెట్లపల్లి ఉప్పలయ్య మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య మండల సీనియర్ నాయకులు చిల్లర చంద్రమౌళి దోమల బాలమల్లు గంగయ్య మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్ కుమార్ కూరం వెంకన్న జంపాల రాజు తారల ఆంజనేయులు తిగుళ్ళ ప్రశాంత్ ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు యల్లయ్య సైదులు అంజయ్య నవీన్, వేణు రెడ్డి ,రాములు వీరయ్య మంచినీళ్ళ మహేందర్ తిగుళ్ళ యాదగిరి ఎర్ర నరేష్ మహేందర్ స్వామి పవన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనకు

# నిరసనగా బిఆర్ఎస్ ఆందోళన



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం మిర్యాలగూడలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సమావేశమై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ, బస్టాండ్ మీదుగా రౌండ్ దాకా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌లతో ఆర్డీవో, ఎంపిడిఓ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి.ఇలియాస్ ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎండి. మగ్దూం పాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు, గంగుల బిక్షం, చంద్రశేఖర రావు, రవి, దుర్గాప్ర సాద్, మట్టపల్లి సైదులు యాదవ్, ఎండి.షోయబ్, యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షం గౌడ్, వింజం శ్రీధర్, పెండ్యాల పద్మ, కోదాటి రమా, షహ నాజ్ బేగం, పెరుమాళ్ళ ధనమ్మ, లలిత, పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### 100 రోజుల్లో ఆరు గ్యారంటీలన్నారు..

# 1000 రోజులు కావస్తున్నా అమలు ఎక్కడ?

ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నాయకుల వినతి



**నకిరేకల్, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు నకిరేకల్ మండల ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే 100 రోజులు దాటి, దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా, వాటిని పూర్తిస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగానే వినతిపత్రం అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగాఢపు నవీన్‌రావు, కేతేపల్లి మండల అధ్యక్షుడు మార వెంకట్‌రెడ్డి, పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, సదానందం, నోముల కేశవరాజు, వీర్లపాటి రమేశ్, గుండగోని జంగయ్య, గణేశ్, కృష్ణకాంత్, దైద పరిమేశ్, సామ శ్రీనివాస్‌రెడ్డి, సైది రెడ్డి, భీమనబోయిన లింగరాజు, స్టీఫెన్, బాధిని రాము, మాచర్ల తిరుమల్, ముక్కముల శ్రీనివాస్, నాగిళ్ల లక్ష్మణ్ తదితర బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

### దళితులం అంటూ అవమానిస్తున్నారు..

# వివక్ష చూపుతున్నారు...!

- ఉప సర్పంచ్ తీరుతో గ్రామాభివృద్ధికి ఆటంకాలు
- జిల్లా కలెక్టర్‌కు అవంతిపురం సర్పంచ్ ఫిర్యాదు



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామ పంచాయితీలో ఉప సర్పంచ్ ఉప్పతల మహేష్ వ్యవహరిస్తున్న తీరుతో గ్రామ పాలన, అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని గ్రామ సర్పంచ్ వల్దాసు సుజాత సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయితీ పరిపాలనకు అడ్డంకులు సృష్టిస్తున్న ఉప సర్పంచ్‌పై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్‌గా ఉండటంతో ఉప సర్పంచ్ రాజకీయ విభేదాలను గ్రామ పంచాయితీ పరిపాలనలోకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షలు, వ్యక్తిగత విభేదాల కారణంగా తన అధికారిక విధులకు పదేపదే ఆటంకాలు కల్పిస్తున్నారని ఫిర్యాదులోపేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పనులు, పంచాయితీ ప్రతిపాదనలు, పూర్తయిన పనుల బిల్లులపై సంతకాలు చేయకుండా కాలయాపన చేస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. సమావేశాలకు కావాలని గైర్హాజరు కావడంతో పాటు, ఇతర వార్డు సభ్యులను కూడా సమావేశాలకు రాకుండాఅడ్డుకుంటున్నారని, దీంతో పంచాయితీ సమావేశాల నిర్వహణకుఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దళిత మహిళా సర్పంచ్‌గా ఉన్నందుకే వివక్ష చూపుతున్నారనే ఆవేదనను సర్పంచ్ వ్యక్తం చేశారు. తాను దళితురాలిననే కారణంతో తన హోదాను తక్కువ చేసి మాట్లాడటం, అవమానకరంగా వ్యవహరించడం, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందని ఆమె ఆరోపించారు. దళితులం అయినందుకే మాపై వివక్ష చూపుతున్నారనే భావన మానసిక క్షోభ అనుభ విస్తున్నామన్నారు. రాజకీయ, వ్యక్తిగత కక్షలకు తోడు సామాజిక వివక్షను కూడా ఎదుర్కొంటున్నాం అని ఆమె పేర్కొన్నారు. పంచాయితీసమావేశాలు, కార్యక్రమాల్లో సర్పంచ్ హోదాకు తగిన గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని, తన అధికారిక విధులను నిర్వర్తించకుండా అనుచిత ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని సుజాత ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ కక్షల కోసం గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని సర్పంచ్ కోరారు. దళిత మహిళా సర్పంచ్‌గా తమపై జరుగుతున్న వివక్ష, వేధింపులపై కూడా విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పంచాయితీ పరిపాలన రాజకీయ కక్షలు, వ్యక్తిగతప్రయోజనాలకు అతీతంగా సజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే తన అధికారిక విధులను స్వేచ్ఛగా నిర్వహించేందుకు రక్షణ కల్పించి, పంచాయితీ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వల్దాసు సుజాత విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# ప్రజావాణికి 66 దరఖాస్తులు

- ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి - పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రజావాణి పోర్టల్‌లో దరఖాస్తులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి
- జిల్లా,మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్







**సూర్యాపేట కలెక్టరేట్ సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి) :** ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా,మండల స్థాయిలో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు,రాష్ట్రస్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు.ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని,నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

**మండల స్థాయిలోనూ ప్రజావాణికి ప్రాధాన్యత :** మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.మండల స్థాయిలోనే స్థానిక సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన ఇబ్బంది తప్పుతుందని పేర్కొన్నారు.

**భూ సమస్యలపై అత్యధిక దరఖాస్తులు :** సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 66 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భూ సమస్యలకు సంబంధించి 35 దరఖాస్తులు, హౌసింగ్‌కు సంబంధించి 12, డీపీఓకు 3, డీఎంహెచ్‌ఓకు 3, ఇతర వివిధ శాఖలకు సంబంధించి 13 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు.అందిన దరఖాస్తులను శాఖల వారీగా సంబంధిత అధికారులకు పంపించి,సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్,డీఆర్వో ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీఎస్ఓ మోహన్ బాబు, డీడబ్ల్యూఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**- అతా నిజాముద్దీన్ బాబా**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 7 ,(ప్రజా జ్యోతి)** మహ్మద్ ప్రవక్త జన్మదిన మాసం రబీ ఉల్ అవ్వల్‌ను పురస్కరించుకుని దారుల్ ఉలూం నూరియా హనఫియా హిఫ్జ్ మదర్సా అధ్యక్షుడు షేక్ యూసఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ వక్త అతా నిజాముద్దీన్ బాబా హాజరై మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. పేదల పట్ల దయ, కరుణ, ప్రేమ కలిగి ఉండాలని, నిరాడంబర జీవితాన్ని గడుపుతూ యావత్ ప్రపంచంలో ఇస్లాం వ్యాప్తికి మహ్మద్ ప్రవక్త కృషి చేశారని అన్నారు, ప్రతి ముస్లిం ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని, తద్వారా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మేలు జరుగుతుందని అన్నారు.అనంతరం మదర్సా చైర్మన్ యాకూబ్ పాషా మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ఆశయ సాధన దిశగా ప్రతి ఏడాది మిలాద్ ఉన్ నబీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం నెలకొల్పేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో మదర్సా కమిటీ సభ్యులు గౌస్ పాషా, ఇక్బాల్‌తో పాటు స్థానిక మసీదులకు చెందిన ఇమామ్‌లు మౌలానా సర్ఫరాజ్ ఆలం, మౌలానా ఖుస్రు అహ్మద్, మౌలానా ఇమ్రాన్ రజా, ఖాజీ రఫీయుద్దీన్, అబ్దుల్ సలాం, షవూద్ రజా తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



**అశ్వాపురం, సెప్టెంబర్7,ప్రజాజ్యోతి** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అశ్వాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. స్పీకర్ పదవికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

**వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను తాతా మధు వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

**ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలి**

రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకూడదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు, రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు**



**చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆరో రోజు నిరసన చేపట్టారు.మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ ఐనవోలు పవన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 33 నెలల బకాయిలు, కళ్యాణ లక్ష్మి– షాదీముబారక్ పథకంలో తులం బంగారం, ఆసరా పెన్షన్లు, విద్యార్థులకు స్కూటీలు, దివ్యాంగుల పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ.12 వేలు, ఆటో కార్మికులకు రూ.12 వేలు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, యడ్ల రామదాసు, తోటపల్లి మాధవరావు, యువజన నాయకులు కాకి అనిల్, అంబోజి సతీష్, కొంబత్తి రాము, తడికల బుల్లెబ్బాయి, గోరింట్ల వెంకటేశ్వరరావు, కట్టడం కన్నారావు, కారం కన్నారావు, సంతపూరి సతీష్, కుక్కడపు సాయి, గాదంశెట్టి కిషోర్, పాసిగంటి సంతోష్, తడికల చంద్రశేఖర్, రావుల కిషోర్, మేడబత్తిని గోవర్ధన్, రాట్నాల శ్రీరామ్మూర్తి, మైప వెంకటేశ్వర్లు, తడికల వెంకటేశ్వర్లు, మామిడి రాజు, నర్సింహారావు పాల్గొన్నారు.

# ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:**

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, వారికి నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జిలుకర పద్మ డిమాండ్ చేశారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలను చర్చించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.
చలో హైదరాబాద్‌లో భాగంగా ఇంద్రాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ధర్నాకు హాజరవుతున్న విషయాన్ని తెలియజేస్తూ వైద్యశాఖ డీపీఓకు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిలుకర పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు. రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే అంశాలపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఆరు నెలల పీఆర్సీ బకాయిలతో పాటు లెప్రసీ, పల్స్‌పోలియో తదితర విధులకు సంబంధించిన ప్రింటింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్‌సీడీ ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, స్కూటమీ డబ్బాలు మోయించకూడదని, ఎన్‌సీ, పీఎన్‌సీ తదితర టార్గెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల వేతనాలతో కూడిన మెడికల్ సెలవులు, ఆదివారాలు, పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఆశా వర్కర్లకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించకపోతే దశలవారీగా పోరాటాలను ఉధృతం చేస్తామని పద్మ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్య తదితరులు పాల్గొన్నారు.

# పర్మిషన్ లేని గ్యాస్ దందా?

**- ప్రజల ప్రాణాలతో హెచ్పీ గ్యాస్ నిర్వాహకుల చెలగాటం?**

**- పట్టణ నడిబొడ్డునే నిర్వహణ.. పక్కనే 700 మంది విద్యార్థుల పాఠశాల!**

**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 7** పట్టణ నడిబొడ్డున అనుమతులు లేకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**స్కూల్ పక్కనే గ్యాస్ నిల్వలు**

గ్యాస్ ఏజెన్సీకి సమీపంలోనే సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాల ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించే ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ల నిర్వహణ జరుగుతుండటంతో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**చుట్టూ జనావాసాలు.. మధ్యలో గ్యాస్ వ్యాపారం**



ఏజెన్సీ చుట్టుపక్కల జనావాసాలు ఉన్నప్పటికీ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? గ్యాస్ నిల్వకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక శాఖ, పౌరసరఫరాలు, ఆయిల్ కంపెనీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**

గ్యాస్ సిలిండర్ల విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పాఠశాల, జనావాసాలకు సమీపంలో ఇలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా నిర్వహణ జరుగుతుంటే ఇప్పటివరకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

గ్యాస్ ఏజెన్సీ నిర్వహణకు సంబంధించి అవసరమైన లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ అనుమతులు, నిల్వ సామర్థ్యం, గోదాం నిబంధనలు తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రజల భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

**"ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా?"**

పాఠశాల పక్కనే గ్యాస్ సిలిండర్ల నిర్వహణపై అధికారులు వెంటనే స్పందించి, అనుమతులు మరియు భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని స్థానికుల డిమాండ్.
ప్రజా భద్రతపై రాజీ వద్దు.. అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అధికారులు స్పష్టం చేయాలి

**సివిల్ సప్లై డిటి ప్రభాకర్ రావు వివరణ**

అశ్వారావుపేట హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ స్కూల్ పక్కనే నిర్వహిస్తున్నరు దీనిపై మీ వివరణ ఏమిటి అని ప్రజా జ్యోతి అడగగా నాకు ఖాళీ లేదు అనే సమాధానం ఇచ్చారు.

# రీ సర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**- భూ భారతి రీ సర్వేతో భూ రికార్డుల ప్రక్షాళన.**

**- రైతుల హక్కులు, హద్దులకు మరింత భద్రత.**

**- ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు.**





**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ సర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భూ రికార్డులు మరింత పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందుతాయని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు అన్నారు. భవిష్యత్తులో భూ వివాదాలు, హద్దుల సమస్యలు, రికార్డుల్లో తలెత్తే లోపాలకు రీ సర్వే ద్వారా శాశ్వతంగా చెక్ పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు.మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో తాటిగూడెం రెవెన్యూ పరిధిలోని రైతులకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భూ భారతి రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ కె. సునీతా ఎలిజబెత్ హాజరై రైతులకు రీ సర్వే ప్రక్రియ, దాని ప్రాధాన్యత, రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..
భూ భారతి రీ సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూముల హద్దులను ఖచ్చితంగా గుర్తించి, అందుకు అనుగుణంగా భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు. రీ సర్వే పూర్తయితే రైతుల భూములకు సంబంధించిన వివరాల్లో మరింత స్పష్టత ఏర్పడుతుందని, భవిష్యత్తులో భూ లావాదేవీలు, వారసత్వ హక్కులు తదితర వ్యవహారాల్లో రైతులకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.
భూమి కొలతలు, హద్దులు, యాజమాన్య హక్కులు తదితర అంశాల్లో స్పష్టత రావడం వల్ల తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుందన్నారు.
భూ రికార్డులు పకడ్బందీగా ఉంటే రైతులకు బ్యాంకు రుణాలు, భూముల క్రయవిక్రయాలు, వారసత్వ బదలాయింపులు తదితర వ్యవహారాల్లో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.
రైతులు రీ సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వే సమయంలో ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, అధికారులకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలన్నారు. భూముల హద్దులు, రికార్డులకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని బండారు నరసింహారావు అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, భూ భారతి రీ సర్వే కూడా రైతులకు భవిష్యత్తులో ఎంతో మేలు చేసే కార్యక్రమమని పేర్కొన్నారు. రైతులందరూ రీ సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి, తమ భూములకు సంబంధించిన రికార్డులను సరి చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,ఏఎంసి చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ కె. సునీతా ఎలిజబెత్,ఆర్ ఐ లు రవి కుమార్, శ్రీషా, ఏఎస్ఓ జానీ,జీపీవో శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ గౌర్రాజు మల్లేశ్వరి,కర్నాటి సుధాకర్ రెడ్డి, వేముల వెంకటేశ్వరావు, గౌర్రాజు రాములు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# విస్తృతంగా పర్యటించిన ఏఏఐ మల్టీ డిసిప్లీనరీ సాంకేతిక బృందం

- గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు
- విమాన రాకపోకలకు సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్ వే ను పరిశీలించిన బృందం
- నైట్ ల్యాండింగ్ కు అవసరమయ్యే భద్రత సదుపాయాలపై అధ్యయనం చేసిన బృందం



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 7 ,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లాల ప్రజల చిరకాల కోరికైనా విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర విమాన శాఖ మంత్రితో చర్చలు జరపగా తుమ్మల విజ్ఞప్తి మేరకు సోమవారం కొత్తగూడెం జిల్లాలో ఏ ఏ ఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం పర్యటించింది సాంకేతిక బృందం విస్తృతంగా పర్యటించింది.కేంద్ర బృందం పర్యటనతో జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడినట్లు అయింది, విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు చేరుకున్న ఈ బృందం మొదటి రోజు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ సందర్భంగా ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధ్యయనం చేసింది.
జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే , సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోంది.ఈ సందర్భంగా సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమై ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ఏ టి ఆర్–72 తరహా విమానాలతో పాటు పెద్ద ఎయిర్‌బస్ ఏ 320/ఏ321 విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనతదితరఅంశాలపై చర్చించారు,
జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి, బృందం క్షేత్రస్థాయి పరిశీలన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు.రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించగా, రెండో రోజు కూడా షెడ్యూల్ ప్రకారం మిగిలిన ప్రాంతాలు, సాంకేతిక అంశాలను బృందం పరిశీలించనుంది. మొత్తం పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి, విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు, ఏఏఐ సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూగజీవాలపై క్రూరత్వాన్ని హరికట్టాలని డీఎస్పీకి బీజేపీ ప్రతినిధుల వినతి




**కొత్తగూడెం కలెక్టరేట్, భద్రాచలం / సెప్టెంబర్ 7 ,(ప్రజా జ్యోతి)** భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఎద్దులు, ఆవులతో ఇసుక బండ్లు లాగిస్తూ అధిక బరువులు మోయించడం, విశ్రాంతి లేకుండా పదేపదే తిప్పడం, అలసిపోయిన మూగజీవాలను కొట్టడం వంటి చర్యలను అరికట్టాలని కోరుతూ బిజెపి బృందం సోమవారం భద్రాచలం డీఎస్పీ, ఎస్‌డీపీఓ ఎం.అరుణ్ కుమార్ని కలిసి వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ గోదావరి ఇసుక ర్యాంపుల నుంచి భద్రాచలం పట్టణం వైపు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక తరలిస్తున్న సమయంలో మూగజీవాలపై జరుగుతున్న క్రూరత్వంపై తక్షణమే విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ బృందం కోరినట్లు తెలిపారు, పశువులతో పని చేయించడం సంప్ర దాయంలో భాగమే అయినప్పటికీ, అధిక బరువులు మోయిస్తూ, విశ్రాంతి లేకుండా నడిపిస్తూ, కొట్టడం మాత్రం క్రూరత్వమే అని అన్నారు,
భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి పవిత్ర క్షేత్రమని, గోమాతను గౌరవించే సంస్కృతిలో మూగజీవాలపై క్రూరత్వానికి తావులేకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ బృందం డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ నాయకులు కుంజా ధర్మా, నిడదవోలు నాగబాబు, ముత్యాల చంద్రశేఖర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను పరిష్కరించాలి

### కలెక్టర్‌కు తెలంగాణ రైతు రక్షణ సమితి వినతి



**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 07 :** తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మైసయ్య యాదవ్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా కొరత లేకుండా యూరియా యాప్ ద్వారా మండలాల వారీగా పంపిణీ చేయాలని, ఉదయం,సాయంత్రం ప్రత్యేక సమయాలను కేటాయించి రైతులకు సులభంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం వర్షాలు సరిగా లేకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు సాగునీటి అవసరం పెరిగిందని,విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే రైతు బీమా పథకం ఆగస్టు 13తో ముగిసినందున, గతంలో అమలు చేసిన విధంగానే రైతు బీమా పథకాన్ని కొనసాగించి రైతు కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు,గతంలో సన్న వడ్లలో 33 రకాల ధాన్యాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించిన ప్రభుత్వం,ప్రస్తుతం కేవలం ఏడు రకాలకే రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించడం వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల గతంలో మాదిరిగానే 33 రకాల సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**రైతుల సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ..**

యూరియా పంపిణీని మండలాల వారీగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని,విద్యుత్ కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సన్న వడ్ల బోనస్,రైతు బీమా అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంతంగారి వెంకటేశం,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్,జిల్లా కార్యదర్శి పరశురాం యాదవ్,జిల్లా సభ్యులు పెద్దకోళ్ల మల్లేష్తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం..

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

### – జిల్లా కలెక్టర్ కె.హైమావతి




**సిద్దిపేట, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పర్యావరణ పరిరక్షణ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కలుషితమవుతున్నాయని తెలిపారు. మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సారవంతమైన నేలను అందించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, ఎస్‌డీసీ సుదర్శన్ రెడ్డి, ఆర్‌సీ పురం పీసీబీ అధికారి టి. రవీందర్, ఏఓ రాజ్‌కుమార్, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కూల్చివేసి

# అక్కమ నిర్మాణాలు

- చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు
- డ్రైనేజీని పునర్ నిర్మించాలని గ్రామస్తులు ఆరోపణ



**దౌల్తాబాద్, సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి) :** డ్రైనేజీ కూల్చివేసి అక్రమాలు చేపడుతున్న చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై మండిపడుతున్న గ్రామస్తులు. సోమవారం మండల పరిధిలోని మాచిన్ పల్లి గ్రామంలో ఇటీవల డ్రైనేజీ ను కూల్చివేసి అక్రమ నిర్మాణాలను చేపడుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు పలువురు తెలియజేశారు. డ్రైనేజీ కూల్చివేతపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

డ్రైనేజీ కూల్చేసి అక్కడే ఇల్లు నిర్మాణం చేపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో మురుగు నీరు నిలిచిపోయి, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొందన్నారు.ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువను ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేసి నిర్మాణం చేపడుతున్న వారిపై అధికారులు విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కూల్చివేసిన డ్రైనేజీని పునరుద్ధరించి, డ్రైనేజీని పునర్ నిర్మించాలని తెలియజేశారు. డ్రైనేజీని కూల్చేసిన బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు.

# ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు

### ఇందిరమ్మ ఇల్లు,ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ మంజూరుతో పాటు పలు సమస్యలపై వినతులు





**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 07 :** శివ్వంపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు,ప్రజాప్రతినిధులు అధికారులకు దరఖాస్తులు సమర్పించారు.శివ్వంపేట గ్రామానికి చెందిన బి.దుర్గయ్య తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.చిన్న గొట్టిముక్కుల కొత్త కాలనీలో మ్మఓహెచ్ఎస్ఆర్ (ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్) ట్యాంక్ మంజూరు చేయాలని సర్పంచ్ అధికారులను కోరారు.అలాగే తూప్రాన్--సంగారెడ్డి హైవేపై చండి గ్రామం సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని శివ్వంపేట గ్రామానికి చెందిన బి.రవి దరఖాస్తు సమర్పించారు.ఇతర సమస్యలపై కూడా పలువురు దరఖాస్తులు అందజేశారు. వివాహమైన మహిళలకు తులం బంగారం,అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు,రైతులందరికీ రైతు భరోసా,వడ్లకు బోనస్,రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం,నిరుద్యోగ భృతి,విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్,బీసీ,ఎస్సీ వెల్ఫేర్ కింద ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని, అక్రమంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని కోరుతూ శివ్వంపేట గ్రామానికి చెందిన పబ్బ రమేష్ గుప్త,గోమారం చంద్ర గౌడ్ తో పాటు పలువురు దరఖాస్తులు సమర్పించారు.అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి,సంబంధిత శాఖల ద్వారా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# విద్యుదాఘాతంతో యువకుడు మృతి





**మెదక్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 07 :** విద్యుత్ ఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన విషాద ఘటన పాపన్నపేట్మ్ మండల్ పరిధిలోని చిత్రియాల గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో సోమవారం చోటుచేసుకుంది.

**పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. :** గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టల కుమార్ (35) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఏనె ప్రాంతంలో పెళ్లి నిర్మాణానికి సంబంధించిన ఇనుము సామగ్రిని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఇనుప రాడ్డు సమీపంలోని హైటెన్షన్ విద్యుత్ సరఫరా లైన్‌కు తగలడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కుమార్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచినామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించారు మృతిని భార్య దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాపన్నపేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతుడికి భార్యా దుర్గమ్మ తో పాటు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నాడు కుమార్ మృతితో గాజులగూడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే ఊరుకోం

### ఎమ్మెల్యేల అరెస్టులు దారుణం





**సిద్దిపేట, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.శాసనసభ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిద్దిపేటలో పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల ఫ్లైఓవర్ వద్ద రాస్తారోకో నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను రానివ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎమ్మెల్యేగా శాసనసభ సమావేశాల్లో పాల్గొనడం తమ హక్కని, ఆ హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు.మహిళా ఎమ్మెల్యేలను సైతం గౌరవించకుండా పోలీసులు భౌతికంగా వ్యవహరించడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకత్వం.. తెలంగాణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, శాసనసభ సమావేశాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత తీవ్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# సిద్దిపేటను ఢీకొంటారా?

### దండయాత్ర కాదు.. నిధుల యాత్ర చేయాలి




**సిద్దిపేట, సెప్టెంబర్ 07,(ప్రజాజ్యోతి) :** తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. సిద్దిపేట, సిరిసిల్లపై దండయాత్ర చేస్తానంటూ పదేపదే వ్యాఖ్యలు చేయడం ఏమిటని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాముని శ్రీనివాస్, ఒగ్గు బాలమల్లు, ఎల్లారెడ్డి, సాయిరాం లు ప్రశ్నించారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు గుండు భూపేష్, మోహన్‌లాల్‌తో కలిసి వారు మాట్లాడారు.సీఎంగా రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిన రేవంత్ రెడ్డి.. సిద్దిపేటపై దండయాత్ర చేస్తానని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దండయాత్ర అంటే ఏమిటో ముందు ముఖ్యమంత్రి తెలుసుకోవాలన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు నిలిపివేసిందని ఆరోపించారు. నిజంగా సిద్దిపేట అభివృద్ధిపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే సగంలో నిలిచిపోయిన పనులకు వెంటనే నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రజలను లక్ష్యంగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం మానుకుని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. సిద్దిపేట ప్రజలు చైతన్యవంతులని, రాజకీయ కక్ష సాధింపులను తగిన విధంగా తిప్పికొడతారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళా, యువజన, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి

# నిరుపేదలకు వరం

### సర్పంచ్ పంజ స్వామి



**దౌల్తాబాద్, సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి) :** సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని సర్పంచ్ పంజా స్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన మారుపాక కల్పన భర్త కర్ణాకర్ 16500 రూపాయల, పంజా సత్యనారాయణ తండ్రి మల్లయ్య 20500 రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందజేశామన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబ సభ్యులు కార్పొరేట్ వైద్యం చేయించుకున్న కుటుంబ సభ్యులకు సీఎం సహాయ అనేది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు గ్రామంలో ఇంకా ఎవరైనా కార్పొరేటర్ వైద్యం చేయించుకొని ఉంటే వారి రిపోర్ట్స్ ను బిల్లులు తమకు ఇవ్వాలని తెలియజేశారు. వారికి సీఎం సహాయ నిధి ద్వారా వచ్చే రూపాయలను మంజూరు చేపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాశం యేసు, తోట నరేష్, దాసరి బిక్షపతి, పోతిగంటి మల్లారెడ్డి, పోతుగంటి శ్రీనివాస్, పాండర్ రెడ్డి, దాసరి, నాగయ్య, పాశం గంగయ్య, మాదారు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన

# హామీల జాడేది

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన 420 హామీల జాడ లేకుండా పోయిందని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిఆరెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మాజీ ఎంపీపి మాణిక్య రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాముని శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో అధికారులకు ఆయా గ్రామాల సర్పంచులు దరఖాస్తులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామన్నా మాటలు నేటికి మూడు ఏండ్లు దాటినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అయిందన్నారు. ఇచ్చిన ప్రతిఒక్క హామీని నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య,ఆయా గ్రామాల సర్పంచులు,పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### పెండింగ్ దరఖాస్తులపై తక్షణమే చర్యలు చేపట్టాలి – కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్. సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి) :** మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 61 దరఖాస్తులు అందాయి. వీటిలో భూభారతికి సంబంధించి 22, ఇందిరమ్మ ఇళ్లకు 9, పెన్షన్లకు 5, ఇతర సమస్యలకు సంబంధించి 25 దరఖాస్తులు ఉన్నాయి. అనంతరం సీఎం ప్రజావాణి, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను కూడా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

# శివ రూపంలో ఆంజనేయస్వామి దర్శనం



**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 07 :** శివ్వంపేట మండలం చాకరి మెట్ల శ్రీ సహకార హనుమాన్ దేవాలయంలో శ్రావణమాసం చివరి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాజాప్రభు శర్మ, శ్రీ ఆంజనేయస్వామి వారికి శివ రూపాలంకరణ చేశారు.శివలింగ రూపంతో పాటు ప్రత్యేక పుష్పమాలలు,బిల్వదళాలతో స్వామివారిని సుందరంగా అలంకరించారు.శివ రూపంలో అలంకరించిన ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించి,భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.శివ రూపంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.ఆలయ ప్రాంగణం భక్తుల సందడి తో హనుమాన్ నామస్మరణతో మార్మోగింది.

# అడవికి కట్టెలు కోసం వెళ్లిన రైతు మృతి

### ఉడుము కేసులో వేధింపులే కారణం



**మెదక్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 07 :** ఉడుమును నువ్వే పట్టుకున్నావు అంటూ బీట్ ఆఫీసర్ అర్జున్ కార్యాలయం తీసుకెళ్లారని కుటుంబ సభ్యుల ఆరోపణ అడవికి కట్టెల కోసం వెళ్లిన రైతు మృతి చెందడం మెదక్ మండలం పాతూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నింపింది ఉడుము పిల్లలను పట్టుకున్నావంటూ అటవీ శాఖ బీట్ ఆఫీసర్ అర్జున తనను కార్యాలయానికి దూసుకెళ్లి విచారించారని ఆ తర్వాత వేధింపుల గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ వేధింపుల భయంతోనే పోచయ్య తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆరోపిస్తున్నారు పాతూరు గ్రామానికి చెందిన బస్సా పోచయ్య (55 )ఇంట్లో శ్రీమంతం కార్యక్రమం ఉండటంతో వంటచేరుకు కోసం అడవికి వెళ్ళినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు ఆయనతో పాటు ఉన్న కుక్క అడవిలో ఓ ఉడుము పిల్లలను గుర్తించినట్టు చెప్పారు ఈ విషయం అడవి శాఖ అధికారులు దృష్టికి వెళ్లడంతో ఉడుము నువ్వే పట్టుకున్నావు అంటూ బీట్ ఆఫీసర్ వేధించాడని ఈ వేదనలతోనే పోచయ్య మృతి చెందాడని పోచయ్య మృతితో పాతూర్ గ్రామంలో విషాదం నెలకొంది కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులను ఈ సంఘటన కలిసి వేశాయి ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి బీట్ ఆఫీసర్ అర్జున్ తో పాటు ఘటనకు బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు విచారణ పేరుతో నిజంగానే దాడులు వేధింపులు జరిగాయా పోచయ్య మృతికి అవే కారణమా అనే అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిజాలను బయటపెట్టాలని గ్రామస్తులు కోరారు ఉడుము వ్యవహారం నుంచి రైతు మృతి వరకు జరిగిన పరిణామాలపై పూర్తిస్థాయి విచారణ జరిగితే నే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఇందిరమ్మ ఇల్లు.. పేదల ఆత్మగౌరవ ప్రతీక





- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య
- దేవుని ఎర్రవెల్లి, పల్గుటలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

**చేవెళ్ల, సెప్టెంబర్ 7(ప్రజా జ్యోతి) :** ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవెల్లి, చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో, పల్గుట్ట వార్డుల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలే యాదయ్య మాట్లాడుతూ.. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి గ్రామం, ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, కరికే మీనాక్షి సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి ఎదిరే చంద్రయ్య, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, కరికే మల్లేశం, రామ్ రెడ్డి, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, మోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు హరిజన శివయ్య బస్సు పురం వెంకటయ్య ఎదిరే యాదయ్య, చింపుల మల్లారెడ్డి ఎదిరి బక్కయ్య, కావలి మల్లేష్, బుచ్చిరెడ్డి, ఎండి జావీద్ పెద్దోళ్ల రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. 6 గ్యారంటీలను నెరవేర్చాలి
- సరూర్‌నగర్ ఎంఆర్‌ఓకు భారాస నాయకుల వినతిపత్రం




**అబ్దుల్లాపూర్ మెట్టు సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని ఎల్.బి.నగర్ నియోజకవర్గానికి చెందిన భారాస నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేటికీ అనేక హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని వారు విమర్శించారు. ఈ మేరకు సోమవారం సరూర్‌నగర్ ఎంఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భారాస నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం తదితర హామీలను అమలు చేయాలని కోరారు. రైతులకు రైతుభరోసా, ప్రతి పంటకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు విద్యాభరోసా కల్పించడంతో పాటు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన పెన్షన్లు అందించాలని, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, విద్యార్థులు, యువత, రైతులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్నికల హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, భవాని ప్రవీణ్‌కుమార్, పద్మానాయక్, సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆందోళన సత్యం చారి, డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, వరప్రసాద్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, రాజిరెడ్డి, తోట మహేష్‌యాదవ్, జక్కిడి మల్లారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలుకు మండల పరిషత్ అధికారులకు వినతిపత్రాలు





- 1000 రోజులు పూర్తైనా హామీలు నెరవేరలేదని ఆరోపణలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని బీఆర్ఎస్ డిమాండ్

**పరిగి, సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మండల అధ్యక్షులు ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల పేరుతో ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వెయ్యి రోజులు పూర్తయినా వాటిలో చాలా వరకు అమలు కాలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, స్కూటీ అందించడంతో పాటు రైతులకు రైతు భరోసా, పంట బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కూలీలకు వార్షిక ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

అలాగే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, విద్యార్థులకు విద్యా భరోసా కల్పించి పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్, ఆటో కార్మికులకు వార్షిక ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల ప్రకారం అర్హులైన ప్రతి సభ్యుడికి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి అరవింద్ రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీ, మాదారం సర్పంచ్ రాములు, ఆసిఫ్, నయీం అలాగే పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర పాలనలో పరిగి అభివృద్ధి శూన్యం

- ముకుంద నాగేశ్వర్ విమర్శలు
- శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి పనులు
- పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్



**పరిగి, సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** పరిగి నియోజకవర్గ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని తెలంగాణ ఉద్యమ నాయకులు, బీజేపీ నాయకులు ముకుంద నాగేశ్వర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో పరిగి ప్రాంతానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదని ఆయన ఆరోపించారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల ద్వారా పరిగి ప్రాంతానికి నీటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. లక్నాపూర్ ప్రాజెక్టు సుందరీకరణ, రైతు బజార్, మోడల్ మార్కెట్ నిర్మాణాలు, డిగ్రీ కళాశాల భవనాలు, గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాల నిర్మాణం వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. అలాగే పరిగి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, కొత్త మండలాల ఏర్పాటు, సమీకృత మండల కార్యాలయ భవనాలు, కుల్కచర్లలో వంద పడకల ఆసుపత్రి, మహిళల ఉన్నత విద్య కోసం ప్రత్యేక విద్యాసంస్థల ఏర్పాటు వంటి అంశాలు కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

పరిగి మున్సిపాలిటీ భవనం నిర్మాణం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, ఆలయాల అభివృద్ధి, భూముల పరిరక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శించాయని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గానికి భారీగా నిధులు కేటాయిస్తుండగా పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని పేర్కొన్నారు.

ఇప్పటికైనా ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ముకుంద నాగేశ్వర్ కోరారు.

ప్రజల అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

- హామీలు ఇవ్వడం వరకే మరి నెరవేర్చేది ఎవరు
- ప్రజా సమస్యలు పాలకులకు కనిపించడం లేదా
- తాండూరు అభివృద్ధిని కొడంగల్‌కు ధారాధత్తం చేయడం సమంజసమా



**యాలాల్ సెప్టెంబర్ 7 ప్రజా జ్యోతి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీల అమలను వెంటనే నెరవేర్చి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని యాలాల మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ వీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ప్రజా సమస్యలపై దరఖాస్తు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన "ఆరు గ్యారంటీలు" మరియు దాదాపు 420 అసంపూర్ణ హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని 420 హామీలు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. వెయ్యి రోజులు గడుస్తున్నా కూడా నేటికీ ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పాలన వైఫల్యం పై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా సమర శంఖం పూరించిందన్నారు. వ్యవసాయ రంగానికి సాగు నీరు విడుదల చేయకుండా, 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వకుండా, యూరియా సరఫరాలో పూర్తిగా విఫలమైందన్నారు. వృద్ధులు, వికలాంగులకు నాలుగు వేల పింఛన్, మహిళలకు రెండు వేల పింఛను ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. విద్యార్థులు, యువకులకు విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి సిద్రాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వడ్డే రాములు, కిరణ్, కృష్ణ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## భూ పోరాట కేంద్రంలో పేద పిల్లలకు దుస్తుల పంపిణీ



**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** నిరుపేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నారాయణ సేవా ట్రస్టు ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్--3 భూపోరాట కేంద్రంలోని పేదల సముదాయంలో ఆదివారం నారాయణ సేవా ట్రస్టు, మిషన్ ఛాయా సంస్థల ఆధ్వర్యంలో నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకున్న దాంట్లో కొంత భాగాన్ని నిరుపేదలకు మానవతా దృక్పథంతో అందించాలనే ఉద్దేశంతో నారాయణ సేవా ట్రస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో అవసరమైన వారికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. భూపోరాట కేంద్రంలోని పేద కుటుంబాలకు, చిన్నారులకు సహాయం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పేద విద్యార్థుల చదువుకు కూడా తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

**అభినందనీయమైన సేవా కార్యక్రమం :** సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేసిన నారాయణ సేవా ట్రస్టు, మిషన్ ఛాయా సంస్థల సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. పేదల సంక్షేమానికి సంస్థలు ముందుకు రావడం సంతోషకరమని, వారికి సీపీఐ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. మరింత మంది నిరుపేదలకు సహాయం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, నారాయణ సేవా ట్రస్టు సభ్యులు ముకేశ్‌జీ, సునీత, శారద, మహేశ్వరి, సీపీఐ నాయకులు దుప్పం నిరంజన్, ప్రజా సంఘాల నాయకులు శోభన్, వీరేష్, అలివేలు, వెంకట్ నాయక్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మిషెలిన్‌కు నాలుగు కొత్త స్టోర్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి) :** మిషెలిన్ ఇండియా హైదరాబాద్‌లో జూబ్లీ హిల్స్, సరూర్‌నగర్, గండిమైసమ్మ, కొంపల్లిలో నాలుగు కొత్త 'మిషెలిన్ టైర్స్, సర్వీసెస్' స్టోర్లను ప్రారంభించినట్లు మిషెలిన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శాంతనుదేశ్‌పాండే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్, గండిమైసమ్మ స్టోర్లను మిషెలిన్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ బి టూ సి బెంజమిన్ కోస్నాన్, సరూర్‌నగర్, కొంపల్లి స్టోర్లను ఎస్.పి డైరెక్టర్ కునాల్ దోషి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వీల్ ఓ సిటీ, విఘ్నేశ్వర వీల్స్, సచిన్ టైర్స్, లంబోదర టైర్స్ భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ స్టోర్లలో ప్రీమియం టైర్లు, అధునాతన ఆటోమోటివ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 'మేడ్-ఇన్-ఇండియా ప్రైమసీ 5' టైర్ల లభ్యత కూడా పెరగనుందని చెప్పారు. హైదరాబాద్ కీలక మొబిలిటీ మార్కెట్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో నాలుగు స్టోర్ల ఏర్పాటుతో ప్రీమియం ఉత్పత్తులు, ప్రపంచ స్థాయి సేవలను మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు.

## క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు

- రోబోటిక్ ఫ్లోరోసిన్స్ గైడెడ్ టెక్నాలజీ తో క్యాన్సర్‌కు చెక్
- యశోద హాస్పిటల్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ గౌడ్




**రాజేంద్రనగర్ సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి) :** ఈ మధ్యకాలంలో క్యాన్సర్ అందరిని పట్టిపీడిస్తున్న మహమ్మారిగా మారిందని, అయితే ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయని ప్రముఖ ఆంకాలజిస్ట్ యశోద హాస్పిటల్ డాక్టర్ రాజేష్ గౌడ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన బాగా పెరిగిందని, ఇప్పుడు వచ్చిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో క్యాన్సర్ వచ్చినా పూర్తిగా నయం చేయవచ్చు అన్నారు. అలాంటి టెక్నాలజీని రోబోటిక్ క్లోరోసెన్స్ గైడెడ్ అంటారు. రోబోటిక్ సర్జరీ అంటే అందరూ రోబోనే సర్జరీ చేస్తుందని అనుకుంటారు. కానీ రోబో సహాయంతో డాక్టర్ చేసే సర్జరీనే రోబోటిక్ సర్జరీ అంటారు. గతంలో ఆపరేషన్ అంటే పెద్ద కటింగ్ ఉండేది కానీ ఇప్పుడు 8 మిల్లి మీటర్ రంధ్రం వేసి ఇన్‌ట్రూమెంట్‌ను లోపలికి పంపి కెమెరా ద్వారా చూస్తూ సర్జరీ చేస్తున్నాం. దీనివల్ల ట్యూమర్ ఎక్కడ వరకు స్ప్రెడ్ అయ్యిందో స్పష్టంగా తెలుస్తుంది.

**గర్భాశయ క్యాన్సర్ :** గతంలో సర్జరీ తర్వాత వారం రోజులు విశ్రాంతి నెల రోజులు బరువు ఎత్తకూడదని నిబంధన ఉండేది. ఇప్పుడు ఉదయం సర్జరీ చేస్తే సాయంత్రానికి డిశ్చార్జ్ చేస్తున్నాం అన్నారు. పెద్దపేగు క్యాన్సర్ గతంలో పేగును బయటకు తీసి డైవర్షన్ పైప్ వేసేవారు ఇప్పుడు ఎక్కడి వరకు స్ప్రెడ్ అయిందో అక్కడ మాత్రమే సర్జరీ చేస్తే సరిపోతుంది. కిడ్నీ క్యాన్సర్ గతంలో క్యాన్సర్ వస్తే కిడ్నీ మొత్తం తీసేవారు ఇప్పుడు అల్ట్రాసౌండ్ సహాయంతో ఎక్కడ వరకు స్ప్రెడ్ అయిందో గుర్తించి రోబోటిక్ సర్జరీ ద్వారా ఆ భాగాన్ని మాత్రమే తొలగిస్తున్నాం. శరీరంలోని ఇతర భాగాలకు ఇబ్బంది కలగకుండా ఎక్కడైతే క్యాన్సర్ ఉందో దాన్ని మాత్రమే తొలగించే అవకాశం రోబోటిక్ సర్జరీతో ఉందని డాక్టర్ రాజేష్ గౌడ్ వివరించారు.

## హెర్బల్‌లైఫ్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించిన కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్



**అబ్దుల్లాపూర్ మెట్టు సెప్టెంబరు 7 (ప్రజాజ్యోతి) :** తుర్కయంజాల్ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హెర్బల్‌లైఫ్ న్యూట్రిషన్ వెల్‌నెస్ సెంటర్‌ను టీపీసీసీ ప్రచార కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్, తుర్కయంజాల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ రావుల లింగంతో కలిసి ఆయన సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన పోషకాహార, ఆరోగ్య అవగాహన సేవలు అందిస్తూ సెంటర్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలి

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- శంషాబాద్ సిద్దులగుట్ట జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకం,పూజలు





**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి) :** వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ప్రసిద్ధ సిద్దులగుట్ట శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామివారి 71వ బ్రహ్మోత్సవాలు జాతర అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పవిత్రమైన శ్రావణ మాస ఆఖరి సోమవారం పురస్కరించుకుని ఈ వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దులగుట్ట దేవస్థానంలో కొలువై ఉన్న పరమశివుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.. స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీస్సులు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాస ఆఖరి సోమవారం రోజున శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ జాతరలో భాగంగా నిర్వహించిన మహా మంగళహారతి, మహా రుద్రాభిషేకం, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రధాన అధ్యక్షుడు బండి శ్రీకాంత్ యాదవ్, శంషాబాద్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, నాయకులు గణేష్ గుప్తా, మహేందర్ రెడ్డి, నీరటీ రాజు, సంజయ్ యాదవ్, మాడపతి నరేందర్, బండి భాగ్యలక్ష్మి, పండరినాథ్ గుప్తా,చింతల రాము, శంకర్ రెడ్డి,మల్లేష్ ముదిరాజ్, జగ్జీవన్ రెడ్డి, అరుణప్ప, శ్రీనివాస్,శేఖర్,జగదీష్ అప్ప, రాహుల్ అప్ప, శివ రెడ్డి, గౌతమి వివేకం, ప్రకాష్ చారి, నరేందర్ చారి,పవన్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, టిడిపి జంగయ్య, కిట్టు, శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వర మే పరిష్కరించాలి..

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి )
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి 197 అర్జీలు స్వీకరించారు. మొత్తం అర్జీలు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 68, కరీంనగర్ నగరపాలక కు29 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి నిరంతరం



పర్యవేక్షిస్తున్నారని.. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు లాగిన్ లో అప్ డేట్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 19 నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు

కొడిమ్యాల, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభం కానున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈఓ కార్యాలయంలో పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 19న అండర్–14,17 బాలబాలికలకు



వాలీబాల్, 21న కబడ్డీ, ఖో–ఖో, 22న అథ్లెటిక్స్ పోటీలు, 22న మధ్యాహ్నం 3 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు చదువు, పుట్టిన తేదీ, ఆధార్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ బూట్ల రాజమల్లయ్య తెలిపారు. సమావేశంలో పీడీలు లక్ష్మీరాంనాయక్, బీరయ్య, శివకృష్ణ, అనూప్‌రెడ్డి, హబీబ్ అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు

కొడిమ్యాల,సెప్టెంబర్ 7,(ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ స్వరూప తెలిపారు. సోమవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన




కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, నీటి పారుదల శాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్లాడపేట ప్రాథమిక పాఠశాలలో దుస్తుల పంపిణీ

### సర్పంచ్ ఎలగందుల నరసింహులు

ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి )
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (పెద్దబడి) వద్ద విద్యార్థిని విద్యార్థులకు సర్పంచి ఎలగందుల నరసింహులు ప్రభుత్వం అందజేసిన ఉచిత



దుస్తులను పంపిణీ చేశారు ప్రభుత్వము ఇచ్చే సౌకర్యాలను వినియోగించుకోవాలని పాఠశాల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ కోసం దరఖాస్తుల ఆహ్వానము

తిమ్మాపూర్, సెప్టెంబర్ 7 ( ప్రజాజ్యోతి )
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో అసిస్టెంట్ కుక్ గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు అర్హత గల మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించ బడుచున్నవని మండలవిద్యాధికారి ఒక పకటన లోతెలిపారు.దీనికి ఏడవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి తిమ్మాపూర్ మండలంలోని మహిళలు మాత్రమే ఈ పోస్టుకు అర్హులు బయోడేటాను ఈ నెల తొమ్మిది బుధవారం నుండి పదకొండవ తారీకు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల లోపు ఎం ఆర్ సి తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీ కార్యాలయము నందు గెజిటెడ్ అధికారి చే అటస్ట్ చేయబడిన ప్రతులు జతపరిచి,ఏడవ తరగతి మార్కులమెమో స్థానికతను ధ్రువీకరించు సర్టిఫికెట్ ఆధార్ కార్డుపుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రము ఈ ఎంపిక కేవలం కాంట్రాక్టు పద్ధతిలో మాత్రమేఉంటుంది.ఎంపికైన అభ్యర్థికి నెలకు 9750 రూపాయల గౌరవ వేతనంఇవ్వబడును.కుకింగ్ డెమోనిర్వహించబడును నిర్ణీత సమయము తర్వాత దరఖాస్తులు స్వీకరించబడవు
ఈ ఎంపిక వాయిదా వేయుటకు అలాగే రద్దు చేయుటకు పూర్తి అధికారం కార్యాలయమునకు కలదు ఇతర వివరాల కోసం ఎంఆర్సి తిమ్మాపూర్ నందు సంప్రదించగలరని తిమ్మాపూర్ మండల విద్యాధికారి తెలిపారు.

## ఎమ్మెల్యేల అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్.

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి )
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా సబ్బండ వర్గాలను మోసం చేసిందని, ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు ఉధృతమయ్యాయి. ప్రజా సమస్యలపై నిలదీసేందుకు అసెంబ్లీ సమావేశాలకు నల్ల చొక్కాలు ధరించి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని, అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లో గులాబీ శ్రేణులు కదం తొక్కాయి. కరీంనగర్ బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ఆందోళన కారణంగా ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వెయ్యి రోజుల పాలనలో సర్వనాశనమైన వ్యవస్థలు ఈ సందర్భంగా నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు, పేదలకు ఆసరా పెన్షన్లు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. రైతన్నలకు రైతుబంధు, రైతు బీమా కరవయ్యాయని,



జీవిత కాలం సేవ చేసి రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే భయంతోనే నల్ల చొక్కాలతో వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చేతకాని పాలనకు పరాకాష్ట అని విమర్శించారు. తక్షణమే ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్ అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, వారిని అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై గళం విప్పితే అణచివేయాలని చూస్తే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు , బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ రావు , మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ , బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు డివిజన్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రాస్తారోకలో పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన తెలిపారు.

## క్రీడలతో నే విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

### మేయర్ కొలగాని శ్రీనివాస్

### కరీంనగర్‌లో 70వ ఎస్ జి ఎఫ్ అర్బన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 7( ప్రజాజ్యోతి )
విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ




లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.
మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ SGF కరీంనగర్ అర్బన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్–2026-27 పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.
అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో కరీంనగర్ అర్బన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న మేయర్ కొలగాని శ్రీనివాస్, విద్యార్థులను ఉత్సాహపరిచారు.మేయర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు.
కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలకు విద్యార్థుల్లో మంచి ఆదరణ ఉందని, ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని తెలిపారు. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని కరీంనగర్ నగరానికి, తమ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మన్ కె. అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, అంతటి శంకరయ్య, తుమ్మల రమేష్, బన్సీలాల్, మల్లేష్ గౌడ్, వేణుగోపాల్, దారం గౌతమ్‌రెడ్డి, కంకటి అనూప్‌కుమార్, క్రీడా నిర్వాహకులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ పోటీల్లో ఐపీఎస్ విద్యార్థుల హవా

సుల్తానాబాద్, సెప్టెంబరు 7:( ప్రజా జ్యోతి)
మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్





(ఐపీఎస్) విద్యార్థులు ప్రతిభ చాటారు. మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో పలు విభాగాల్లో విజేతలుగా నిలిచి సత్తా చాటారు. అండర్–17 బాలికల కబడ్డీ, బాలుర వాలీబాల్ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించారు.అండర్–14 బాలికల ఖోఖో, అండర్–17 బాలికల వాలీబాల్ విభాగాల్లో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లోనూ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. అండర్–14, అండర్–17 బాలికల విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించగా, అండర్–14 బాలుర విభాగంలో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో పాఠశాల విద్యార్థుల క్రీడా ప్రతిభకు గుర్తింపు లభించింది. జిల్లా స్థాయిలోనూ రాణించాలి విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని నిరంతరం సాధన చేయాలని సూచించారు.
మండల స్థాయిలో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను పోటీలకు సిద్ధం చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, జ్యోతిని వారు అభినందించారు.
కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ శివ, వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బొప్పపూర్ జక్కుల చెరువులో వినాయక నిమజ్జనాలు చెయ్యొద్దు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7: (ప్రజా జ్యోతి)
రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జక్కుల చెరువులో ఇతర గ్రామాల వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో స్థానిక మండల ఎంపీడీవో, ఎంఆర్ఓ, ఎస్‌హెచ్ఓలకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జక్కుల చెరువులో గ్రామానికి మంచినీటి సరఫరా చేసే బావి ఉందని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లోనే



నిమజ్జనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.
జక్కుల చెరువులోని తాగునీటి వనరును కాపాడేందుకు అధికారులు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు ప్రసాద్ రావు, ల్యాగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలుపై ఎంపీడీవోకు బీఆర్ఎస్ వినతి పత్రం

ఎండపల్లి, సెప్టెంబరు 7,,ప్రజా జ్యోతి
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎండపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాలతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.
మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతుభరోసా, పంటలకు బోనస్, రైతు కూలీలకు రూ.12 వేలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, అర్హులకు




రూ.4 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ తదితర డిక్లరేషన్లను అమలు చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు సింహాచలం జగన్ , గౌరి చిరంజీవి తాజా మాజీ ఎంపీటీసీలు సర్పంచులు బిఆర్ఎస్ నేతలు ,కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులకు సన్మానం

### మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలాజీ యాదవ్

ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి)
ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి మనోహరాచారి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు వచ్చిన సందర్భంగా పాఠశాలకు వెళ్లి సోమవారం రోజు ఆత్మీయ



సన్మానం నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులకు విశేష సేవలు అందించేందుకు ప్రభుత్వ గుర్తించి ఉత్త ఉపాధ్యాయుల అవార్డు ఇచ్చింది అందుకు హర్ష వ్యక్తం చేస్తూ ఆత్మీయ సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు బాలరాజు యాదవ్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

ముస్తాబాద్: సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి ):
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, దళిత నాయకుడిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంపల్లి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యానికి దేవాలయమైన అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు



చేయడం దురదృష్టకరమన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించే విధంగా తాతా మధు మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. దళిత నాయకుడిని గౌరవించలేని అహంకార ధోరణిని విడనాడాలని ఆయన హితవు పలికారు. అసెంబ్లీలో స్పీకర్‌ను గౌరవించడం ప్రతి సభ్యుడి బాధ్యత అని అన్నారు. స్పీకర్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తాతా మధుపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఇటువంటి వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కాంపల్లి శ్రీనివాస్ కోరారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని, వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### మండల అధికారులకు వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ పార్టీ

తిమ్మాపూర్, సెప్టెంబర్ 7 ( ప్రజాజ్యోతి ) :-
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మానకొండూరు మాజీశాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్ సూచనల మేరకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి అలాగే మండల అధ్యక్షులు రావుల రమేష్ రాష్ట్ర నాయకులు ఉల్లెంగుల ఏకానందం ఆధ్వర్యంలో 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తానని 1000 రోజులైనా అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రాలలో మండల పరిషత్ అధికారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వినతి పత్రాలు సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.



## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 7,(ప్రజా జ్యోతి) ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు, సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని అన్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధితశాఖలసిబ్బంది పాల్గొన్నారు.

## మూడేళ్ల పెండింగ్ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి

**- ప్రజావాణిలో ఎంపీడీవో రాజేశ్వరికి ఐదు గ్రామ పంచాయతీల సర్పంచుల వినతి**



అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో డి. రాజేశ్వరికి సర్పంచులు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ విద్యుత్ బిల్లుల కారణంగా గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోందని వారు తెలిపారు. పంచాయతీలకు వచ్చే పరిమిత నిధులతో విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయడం ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.
గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అభివృద్ధి పనులకు నిధులు వినియోగించాల్సి ఉంటుందని సర్పంచులు తెలిపారు. అందువల్ల గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను ప్రభుత్వం మాఫీ చేసి గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, పెంట్లం సర్పంచ్ కారం శివ, మర్రిగూడెం సర్పంచ్ సృజన, తొట్టిపంపు సర్పంచ్ సంఘవి, ఊటుపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## టీబీ ముక్త భారత్ అభియాన్ ఉచిత వైద్య శిబిరం



అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని పెంట్లం గ్రామ పంచాయతీలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ కారం శివ ప్రారంభించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ నాజినీన్ తబస్సుమ్ పర్యవేక్షణలో డిజిటల్ మొబైల్ ఎక్స్‌రే యూనిట్ ద్వారా 63 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13 మందికి టీబీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, కళ్లెంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ నాజినీన్ తబస్సుమ్ సూచించారు. అనుమానితులకు కళ్లె (స్పుటమ్), రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి, టీబీ నిర్ధారణ అయిన వారికి ఉచిత మందులు, పూర్తి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. నిక్షయ్ పోషణ యోజన కింద టీబీ రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. మండలంలోని అబ్బుగూడెం గ్రామ పంచాయతీలో ఈనెల 9న, పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో ఈనెల 11న మొబైల్ ఎక్స్‌రే శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటమ్మ, టీబీ సూపర్‌వైజర్ వెంకట్, ఎక్స్‌రే టెక్నీషియన్ సాయి కృష్ణ, ఆశా కార్యకర్తలు ప్రియాంక, లక్ష్మి, రాధ, జ్యోతి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

**నిర్ణీత గడువులోగా పరిశీలన, హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి) ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, అదేవిధంగా నిర్ణీత గడువులోగా పరిశీలన, హియరింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను, అదనపు కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ జాబితాకు సంబంధించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన డాక్యుమెంట్ల ఆధారంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 60 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన జారీ చేసి ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. హియరింగ్‌లను నిర్దేశిత కార్యాచరణ ప్రకారం నిర్వహిస్తున్నామని, ఓటర్లు సరైన డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవసరమైన అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నో మ్యాపింగ్, అనామోలీస్‌కు సంబంధించిన ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## తాత మధుపై చర్యలు తీసుకోవాలి



ఇల్లందు, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్‌లు కోరారు. సోమవారం తాత మధు వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత స్పీకర్ను ఉద్దేశించి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ చేసిన అవమానకర వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ను అవమానించే విధంగా ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సమాజం మనోభావాలను కించపరిచే చేసిన వ్యాఖ్యలను తాతా మధు వెంటనే వెనక్కి తీసుకొని, దళిత సమాజానికి, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఆయన చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత చట్టాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ తాతా మధును పదవి నుంచి తొలగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కోఆప్షన్స్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం తీగల క్రాంతి కుమార్

**- ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్ జన్మదిన వేడుకలు**



సత్తుపల్లి సెప్టెంబర్07(ప్రజా జ్యోతి) స్థానిక సత్తుపల్లిలో కార్మిక నాయకుడు ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్ జన్మదిన వేడుకలను,ఐఎన్టియుసి సీనియర్ నాయకులు పోగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ పాల్గొనీ,కేక్ కటింగ్ చేసి శాలువాతో సత్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తీగల క్రాంతి కుమార్ సింగరేణి కార్మిక సంఘం ట్రేడ్ యూనియన్ సత్తుపల్లి జే.వి.యర్ ఓసి లో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఫిట్ సెక్రటరీ గా,కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ సెక్రటరీగా, నూతనంగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాకు మొట్ట మొదటి వైస్ ప్రెసిడెంట్ గా,ప్రస్తుతం ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ నాయకుడిగా కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సత్తుపల్లి ఏరియా ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యానికి అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చి, సింగరేణిలోని 12వ ఏరియాగా సత్తుపల్లి ఏర్పాటుకు తనవంతుగా కృషి చేశారని, ఐ.ఎన్.టి.యు.సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, యూనియన్ అధినాయకత్వం సహాయ సహకారాలతో సింగరేణి కార్మికులకు, యాజమాన్యానికి మధ్య సత్సంబంధాలను నిర్వహిస్తూ కార్మిక సమస్యల పరిష్కారానికి, సింగరేణి సంస్థ పురోభివృద్ధికి ఉత్తమ సేవలందిస్తున్న నాయకుడు అని,కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గెలుపులో ప్రధాన భూమిక పోషించారు అని అన్నారు.సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, రాష్ట్ర సీనియర్ నాయకులు మట్టా దయానంద్ కు అత్యంత సన్నిహితునిగా తీగల క్రాంతి కుమార్ ఉంటూ, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తున్నారని అభినందించారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత,లక్ష్యం సాధించేందుకు కార్మికలోకాన్ని చైతన్య పరచటంతో పాటు, ఐఎన్టీయూసీ నాయకుడిగా అన్ని వర్గాలకు,కార్మిక సంఘాలకు అతీతంగా కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి, తన వంతు కర్తవ్యంగా కృషి చేస్తాడని తీగల క్రాంతి కుమార్ కు కార్మికులు,కార్మిక సంఘాల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక వైపు జే.వి.యర్ ఓపెన్ కాస్ట్ లో విధులు నిర్వహిస్తూనే, మరో వైపు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తున్నారు. కార్మికుడికి ఏ కష్టం వచ్చినా తాను ఉన్నానంటూ భరోసా ఇస్తున్నారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూనే, కార్మిక సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా ఉంటున్నారు. సత్తుపల్లిలో ఉన్న మైన్స్ లలో పలు సమస్యలు ఎదుర్కొంటున్న కార్మికులు తీగలను ఆశ్రయించిన వెంటనే యూనియన్ ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఎన్నో సమస్యలను పరిష్కరిస్తున్నారు.
కార్మికులకు పెద్దన్న క్రాంతి ఉద్యోగుల మాటల్లో యూనియన్ పదవిని అడ్డుపెట్టుకొని ఎంతో మంది నేతలు విధులకు మాస్టారు పొందినట్లు ఆరోపణలు ఇక్కడ లేకపోలేదు.కానీ తీగల క్రాంతి కుమార్ విద్యావంతుడు వాక్చాతుర్యం కలిగి ఉండి మొదట నుండి కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఎంత ప్రాముఖ్యత ఇస్తాడో, అంతే స్థాయిలో వృత్తికి విలువనిస్తూ డ్యూటీ చేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం గమనార్హం. విధి నిర్వహణలో తన డ్యూటీ చేస్తూ, ఉండడం వల్ల తను యూనియన్ పరంగా ఏ కార్యక్రమం చేపట్టిన ఉద్యోగుల నుండి విశేష స్పందన లభిస్తుందని తెలియజేశారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ కార్మికులకు ఏ సమస్య వచ్చినా సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు అని తెలియజేశారు. గత సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐ.ఎన్.టి.యు.సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, రీజినల్ జనరల్ సెక్రెటరీ ఆల్బర్ట్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు ఏరియాలో ఐఎన్టీయూసీ గెలుపుకు కీలకపాత్ర పోషించారని తీగల క్రాంతి కుమార్ నాయకత్వంలో ఉద్యోగస్తులందరూ ఐఎన్టీయూసీ వెంటే ఉంటామని తెలియజేశారు.



సత్తుపల్లి ఉద్యోగుల సంక్షేమానికి కృషి తీగల క్రాంతి కుమార్
సింగరేణి సంస్థ ఉత్పత్తి వార్షిక లక్ష్యంలో అత్యధికంగా బొగ్గు రవాణా మరియు ఉత్పత్తి జరుగు తున్నటువంటి సత్తుపల్లి ఏరియా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలియజేశారు. సత్తుపల్లి నుండి సుమారు 15 మిలి యన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా జరుగుతున్నందున సిం గరేణి యాజమాన్యం సహాయ సహకారాలతో సత్తుపల్లి ఏరి యాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవటంలో కార్మికులు , కార్మిక సంఘాల నాయకులు అం దరూ కలిసి ఉండాలని తెలియజేస్తూ ఐఎన్టీయూసీ యూనియన్ అగ్ర నేతలతో పాటు యాజమాన్యం సహాయ సహకారాలతో ఎన్నోకార్మికసమస్యలు పరిష్కరించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నప్పుడు అక్రమ సంపాదన.. ఇప్పుడు దిక్కుమాలిన విమర్శలా?

- **బీఆర్ఎస్ కౌన్సిలర్ అప్పారావు డైలాగులు మానుకోవాలి.**
- **తెరవెనుక స్క్రిప్ట్‌లు ఆపి మధిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మధిర అభివృద్ధికి నోచుకోలేదు!**
- **డిప్యూటీ సీఎం భట్టి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఈ వలపు కన్నీళ్లు**
- **మధుర మహిళా కౌన్సిలర్స్ ఘాటు విమర్శ**

మధిర ప్రజా జ్యోతి మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాతపై 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ యాన్నంశెట్టి వెంకట అప్పారావు చేసిన ఆరోపణలను అధికార పార్టీ మహిళా కౌన్సిలర్లు తిప్పికొట్టారు.ఎవరో తెర వెనుక ఉండి రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పట్టుకుని మీడియా ముందు డైలాగులు కొట్టడం కాదని, దమ్ముంటే మధిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.అధికారాలు, పదవులు ఇప్పుడు పోయాయనే బాధను మనసు నుంచి వదులుకోలేక,ఆ పదవి మీద ఉన్న వ్యామోహంతో బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కనడం మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

**పదవులు పోయిన బాధతోనే ఈ దిగజారుడు ఆరోపణలు**

కమల్ రాజు గురించి మాట్లాడే అర్హత చైర్‌పర్సన్‌కు లేదంటూ బీఆర్ఎస్ నేతలు నోరుపారేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని,ప్రజాక్షేత్రంలో ప్రజలచేత ఎన్నుకోబడి, పరిపాలనా దక్షతతో ముందుకు వెళ్తున్న ఒక మహిళా చైర్‌పర్సన్‌ను ప్రశ్నించే నైతిక హక్కు పదేళ్లు మధిరను నిర్లక్ష్యం చేసిన మీకు ఎక్కడిది? అని కౌన్సిలర్లు నిలదీశారు.చైర్‌పర్సన్ సుజాతను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ అప్పారావు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మండిపడ్డారు. వెనుక ఉండి ఎవరో డైరెక్షన్ చేస్తుంటే ఆ తోలుబొమ్మలా ఆడుతూ ప్రెస్‌మీట్లు పెట్టే ఆ సంస్కృతి మీదేనని,చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం కి పరిపాలనపై ఉన్న స్పష్టత, ప్రజల సంక్షేమంపై ఉన్న పట్టు మీ గుండెల్లో రైళ్లుపరిగెత్తిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

**మధిర అభివృద్ధిని విస్మరించిన చరిత్ర మీ నాయకుడిదే**

మధిర మున్సిపాలిటీని గాలికొదిలేసిన కమల్ రాజు హయాంలోని తీరు ప్రజలందరికీ తెలుసని దుయ్యబట్టారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మధిరలో ఏ ఒక్కరోజైనా సరైన ప్రగతి జరిగిందా అని కౌన్సిలర్లు నిలదీశారు.కేవలం నిధులను దండుకోవడం, కాంట్రాక్టర్ల బిల్లుల కోసమే వెంపర్లాడిన చరిత్ర మీ నాయకుడిదని,ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కాలక్షేపం చేశారని మండిపడ్డారు.అలాంటి పాలనను చూసిన మధిర ప్రజలు,నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సుపరిపాలనను చూసి ఆనందిస్తుంటే.. ఓర్వలేక కడుపుమంటతో ఇలాంటి చిల్లర ఆరోపణలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు.

**భట్టి విక్రమార్క కృషితోనే మధిరలో నూతన శకం**

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కఅసాధారణ కృషితోనే మధిర నియోజకవర్గంతో పాటు మున్సిపాలిటీలో నూతన శకం ప్రారంభమైందని స్పష్టం చేశారు.కేవలం శంకు స్థాపనలంటూ అబద్ధాలు ప్రచారం చేసే బదులు,భట్టి విక్రమార్క తీసుకొచ్చిన వేల కోట్ల నిధులతో మారుతున్న మధిర రూపురేఖలు మీ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ప్రజల సంక్షేమాన్ని అడ్డుకోవాలని చూస్తే రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోవడం ఖాయమని,చేతకాని మాటలతో కాలక్షేపం చేయడం మాని క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దోర్నాల శిరీష,యర్రందసు చారులత, బోడపూడి రేవతి, గద్దల మాధురి, షేక్ రసుద్దీన్, నగరకంటి రాజేశ్వరి, బొల్లెద్దు విజయలక్ష్మి, రంగ రూప తదితరలు పాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌ను అవమానించడం నేరం కాదా?

**- దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే**



ఆశ్వారావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 7 ఈరోజు అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభాపతిని అవమానించేలా అనుచిత పదజాలం ఉపయోగించారనే ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్లతో, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ ద్వారా పదవులు పొందిన ప్రజాప్రతినిధులు రాజ్యాంగ విలువలకు, సభా గౌరవానికి, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉంది. కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.
దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం అనేది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు-సమానత్వం, సామాజిక న్యాయం, గౌరవం వంటి రాజ్యాంగ విలువలను అవమానించినట్లే. ఇలాంటి భాషను, ఇలాంటి ప్రవర్తనను ప్రజాస్వామ్య సమాజంఎట్టిపరిస్థితుల్లోనూ సహించకూడదు. కాబట్టి తాతా మధు వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, సభా నియమాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ప్రజాస్వామ్యానికి మరియు సభా గౌరవానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మేము డిమాండ్ చేస్తున్నాం.మా డిమాండ్లపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలి ఇది వ్యక్తిగత రాజకీయ పోరాటం కాదు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం చేసే పోరాటం.రాజ్యాంగాన్ని అవమానించేలా, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించే ఏ నాయకుడైనా ప్రజల ముందు సమాధానం చెప్పాల్సిందే.
రాజ్యాంగం మనకు హక్కులు ఇచ్చింది -- ఆ రాజ్యాంగాన్ని కాపాడటం మన బాధ్యత. ప్రజాస్వామ్యం మన బలం -- దాన్ని కించపరిచే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ఈ కార్యక్రంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జూపల్లి రమేష్ బాబు జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు మండల ప్రెసిడెంట్ చిన్నంశెట్టి సత్యనారాయణ కౌన్సలర్ లు మిండా హరి బాబు నార్లపాటి దివాకర్ అల్లాడి రామారావు కాంగ్రెస్ నాయకులు బండి చెన్నారెడ్డి నారాయణపురం ఉప సర్పంచ్ ఆకుల శ్రీను ఆసుపాక యూత్ కరీం వీరనాల నాగు లు నారాయణపురం గ్రామశాక అధ్యక్షుడు సిహెచ్ నాగేంద్ర మరియు పరిటాల సందీప్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**- ప్రజావాణిలో ఎంపీవో కృష్ణకు బీఆర్ఎస్ నేతల వినతి**




ఎర్రుపాలెం ప్రజా జ్యోతి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలను అందించాలని ఎర్రుపాలెం మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎర్రుపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీవో కృష్ణకు బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిందని, అయితే ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు.హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.వినతిపత్రంలో ప్రధానంగా ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం,స్కూటీ అందించాలని, రైతులకు ప్రతి పంటకు రైతుభరోసా, పంటలకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు విద్యాభరోసా కల్పించడంతో పాటు పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించాలని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన రూ.4 వేల పింఛన్ అందించాలని విజ్ఞప్తి చేశారు.ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, విద్యార్థి, యువజన, రైతు వర్గాలకు ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని, ప్రభుత్వ హామీలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత,మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి,మాజీ సర్పంచ్ గూడూరు రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ కుడుముల మల్లికార్జున రెడ్డి,నాయకులు బొర్ర నరసింహారావు,యరమల కృష్ణారెడ్డి, శ్రీపాలశెట్టి తిరుపతిరావు,గద్దల శ్రీనివాసరావు,కుక్కల అఖిల్, అశోక్, వెంకటరెడ్డి, పొదిల శివరాజ్, గుమ్మా శ్రీను,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డివైఎస్పిని సన్మానించిన ఐఎన్టియుసి నేతలు



ఇల్లందు, సెప్టెంబర్, 7 (ప్రజా జ్యోతి) గోదావరిఖని నుంచి ఇల్లందు ఏరియాకు బదిలీపై వచ్చిన డివైఎస్పి (సివిల్) విజయ్ సాగర్‌ను సోమవారం ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సివిల్ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఏఈ ప్రజ్వల్, ఈఈ ఖాన్ బాషా, సివిల్ సూపర్వైజర్ మహేష్, సంజయ్, జనరల్ అసిస్టెంట్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన, ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

**– తహసీల్దార్లకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలు**

వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 7( ప్రజా జ్యోతి): జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహసీల్దార్లతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగినదని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జనగణనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జనగణన విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలు,




రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నిర్ణీత మార్గదర్శకాలు, గడువులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యం వద్దు: ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి దశను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మ్యాపింగ్ లేని ఓటర్లు, వివిధ రకాల అనామలీస్ గుర్తించిన ఓటర్లకు తప్పనిసరిగా నోటీసులు జనరేట్ చేసి, సంబంధిత ఓటర్లకు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన సమయం ఇచ్చి విచారణ నిర్వహించాలని సూచించారు.

22ఎ భూములపై ప్రత్యేక దృష్టి: జిల్లాలోని 22ఎ భూముల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై తహసీల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. 22ఎ భూములకు సంబంధించి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జెడ్పీ సీఈఓ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ జయసుధ, ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల వ్యవహార శైలి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

**మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు షాయిన్ అఫ్రోజ్ తీవ్ర ఆగ్రహం**

హైదరాబాద్ సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు షాయిన్ అఫ్రోజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం మహిళా ఎమ్మెల్యేలు నల్ల చీరలు ధరించి నిరసన వ్యక్తం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో వారిపై దాడి చేయించడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు.



మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా అణిచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం పూర్తిగా అవమానకరమని మండిపడ్డారు. తెలంగాణలో కీచక పర్వం మొదలైందని, ఇక శ్రీకృష్ణుడు త్వరలోనే వచ్చి, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పారదోలుతాడు అంటూ ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణలో నలుపు రంగును నిషేధించినట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. నలుపు రంగు కేవలం పార్లమెంట్‌లో మాత్రమే ధరించడానికి అనుమతిస్తారా అంటూ ప్రభుత్వ తీరుపై ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకోకపోతే మహిషాసుర సంహారం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. మహిళల గౌరవం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**మొదటిపేజీ తరువాయి..**

రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్ ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్‌కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది

# విద్య వ్యవస్థను రేవంత్ దెబ్బతీస్తున్నాడు..

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి.. హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో కవిత భారీ ర్యాలీ..

హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ప్రజాజ్యోతి : తెలంగాణలో విద్యా వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి



ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండలో 'ఫీజు పోరు యాత్ర' నిర్వహించారు. హనుమకొండ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వేలాది మంది విద్యార్థులతో కలిసి సుమారు మూడు కిలోమీటర్ల మేర కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. నడి ఎండలోనూ విద్యార్థులు, కవిత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం కవిత, విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో ప్రధాన గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. సుమారు అరగంటకు పైగా నిరసన కొనసాగిన అనంతరం పోలీసులు కవితతో పాటు విద్యార్థులను కలెక్టరేట్‌లోకి అనుమతించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్, కలెక్టరేట్ వద్ద విద్యార్థులను ఉద్దేశించి కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లకు పైగా ఫీజు




రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. టైంబౌండ్ నిర్దేశించి బకాయిలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు సకాలంలో చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు, ముఖ్యంగా ఆడబిడ్డలు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు బకాయిల కారణంగా కొన్ని కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని కవిత పేర్కొన్నారు. ఏళ్ల తరబడి బకాయిలు పేరుకుపోవడంతో చిన్నచిన్న కళాశాలలు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. తాను గతంలో శాసనమండలి సభ్యురాలిగా ఉన్న సమయంలో ఇదే సమస్యను సభలో ప్రస్తావించానని కవిత గుర్తు చేశారు. నెలనెలా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. విద్యార్థుల జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. ఇటీవల ఇంటర్మీడియట్ వ్యవస్థపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఇప్పుడు పాలిటెక్నిక్ విద్య కూడా ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని కవిత ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌ను కవిత విద్యార్థులతో కలిసి కలసి వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కోర్సులు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లు అందక విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్ల సమస్యతో ప్రజావాణికి కూడా వస్తున్నారని కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. సర్టిఫికెట్లు ఇవ్వని కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఫీజు బకాయిల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**మొదటిపేజీ తరువాయి..**

పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ముగిసిన బీఏసీ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..**

అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళ్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి..**

పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఆందోళన

### రాస్తారోకోలు– ధర్నా

### ఆదిలాబాద్ లో మాజీ మం త్రి జోగు రామన్న అరెస్ట్

ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి ) అసెంబ్లీకి శాంతి యుతంగా నిరసన తెలుపుతూ భయ లు దేరిన బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలపై పోలీసులు అనుస రించి న వ్యవహారాన్ని నిరసి స్తూ ఆదిలాబాద్ జిల్లాలో పె ద్ద ఎత్తున నిరసనలు వెల్లు వెత్తాయి. రోడ్లపైకి వచ్చి ఆం దోళన కు దిగారు. ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాలు, రాస్తారోకో లు చేపట్టారు. ఆదిలాబాద్



జిల్లాలో ఇచ్చోడ, నేరడిగొం డ, బోథ్, బజార్ హత్నూర్, గుడి హత్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ నార్నూర్, బేల, జై నథ్, తాంసి, తలమడుగు, బీంపూర్ తదితర మండలా ల్లో బిఆర్ ఎస్ నాయకులు ధర్నా లు, రాస్తారోకో నిర్వ హించారు. ఆదిలాబాద్ లో చేపట్టిన రాస్తారోకో కొద్దిసేపు ఉద్రక్తత కు ధారి తీసింది. రో డ్డు పై బైఠాయించి ధర్నాకు దిగిన మాజీ మంత్రి జోగు రామన్న ను పోలీసులు అరె స్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు త రలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతి రేకంగా కార్యకర్తలు నినాదా లతో జాతీయ రహదారి ఒ క్క సారీగా దద్దరిల్లింది. కొద్దీ సేపు పోలీసులు– కార్యకర్త ల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రాస్తారోకో కారణంగా కొంత సేపు రాకపోకలు నిలిచి పో యాయి. నిరసనకారులను చెదరగొట్టేం దుకు పోలీసులు ప్రయత్నించగా, కార్యకర్తలు బైఠాయించి అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జోగు రామన్న అక్రమ అరెస్టు సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ నాయకు లు కార్యకర్తలకు కాన్వాయ్ కి అడ్డంగా పడుకొని నిరస న వ్యక్తం చేశారు. ఈ క్రమం లో రహదారి పై కొద్దిసేపు హై టెన్షన్ వాతావరణం నెల కొంది. జోగు రామన్న అరే స్టు ను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు పోలీసు వాహ నాలను అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు భారీగా మోహరించి పోలీసు లకు కార్యకర్తలకు భారీ తో పులాట నెలకొంది. ఈ సం దర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ, హైదరాబాద్ లో మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి తో సహా మహిళా ఎ మ్మెల్యేల పట్ల, రాష్ట వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు లతో బి ఆర్ఎస్ ఎ మ్మెల్యేల ను కాంగ్రెస్ ప్రభు త్వం కక్షపూరితంగా పోలీసు లతో అడ్డగించడం, కొట్టడం దుశ్చర్యలకు పాల్పడిందని ఆరోపించారు.శాంతియుతంగా నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేయడానికే పోలీసులతో అక్రమ అరెస్టు లు చేయించడం మహిళా సమాజాన్ని అవమానపరచ డమేనని అన్నారు. సీఎం రే వంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా రాష్ట్ర మహిళలకు క్షమాప ణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదని సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు గట్టి గుణపాఠం చె ప్పేందుకు సిద్ధంగా ఉన్నార న్నారు.ఈ నిరసన కార్యక్ర మంలో అలాల్ అజేయ్, మె ట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీష్, దాసరి రమేష్, ఛందల రాజ న్న, ధమ్మపాల్, దివిటి రా జు, బట్టు సతీష్, బుట్టి శివ, మద్దుల ఉషన్న, అనిల్, గణేష్ యాదవ్, భోజన్న, కనక రమణ, వెంకన్న, అఖి లేష్, సంతోష్, సలీం, ఏజాజ్, మోసిన్ తదితరు లు పాల్గొన్నారు.






Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967